మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త



## రోడ్డు ప్రమాదంలో ఎస్ఐకి గాయాలు

**పాపన్నపేట, జూలై 5, ప్రభాతవార్త:**

పాపన్నపేట మండలం ఏడుపాయల కమాన్ సమీపంలోని పెట్రోల్‌బంకు వద్ద శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలయ్యాయి. పాపన్నపేట మండలం నార్సింగి గ్రామానికి చెందిన విఠల్ మెదక్ టౌన్ పోలీస్ స్టేషన్లో ఎస్సైగా విధులు నిర్వర్తిస్తున్నాడు. శుక్రవారంరాత్రి విధులు ముగించుకొని, స్వగ్రామానికి వస్తుండగా ఏడుపాయల శివారులో పెట్రోల్‌బంకు వద్ద బైక్ స్కిడ్ అయి పడిపోయాడు. అతనికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అతన్ని మెదక్‌కు అక్కడి నుండి మెరుగైన వైద్యం కోసం హైద్రాబాద్ తరలిస్తుండగా, సర్దాపూర్ వద్ద అంబులెన్స్‌లో ఆక్సిజన్ అయిపోయినట్లు సమాచారం. దీంతో అరగంటపాటు అతను ఇబ్బంది పడ్డట్లు తెలిసింది. ఎట్టకేలకు హైద్రాబాద్ తీసుకెళుతుండగా, పరిస్థితి ఇబ్బందికరంగా మారినట్లు సమాచారం. పక్కటెముకలు విరగడంతో పాటు, తలకు బలమైన గాయాలైనట్లు తెలిసింది. ఈ విషయమై పాపన్నపేట ఎస్సై శ్రీనివాస్‌గౌడ్‌ను వివరణ కోరగా, తనకు ఫిర్యాదు అందలేదని చెప్పారు.

## గంజి నీరు పడి బాలుడు మృతి

**వర్గల్, జూలై 5, ప్రభాతవార్త:**

వేడిగా ఉన్న గంజినీరు రెండు సంవత్సరాల బాలునిపై పడడంతో మృతిచెందిన సంఘటన వర్గల్ మండలం మాదారం గ్రామంలో చోటుచేసుకుంది. గౌరారం ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం మాదారం గ్రామానికి చెందిన ముత్తి మహేశ్వరి, స్వామి కుమారుడు ముత్తి మోక్షిత్(2) ఈనెల 2వ తేదీన ఉదయం 7.30గంటలకు ఆడుకోవడానికి వారి ఇంటి పక్కనే ఉన్న వారి పెద్దనాన్న ముత్తి ఎల్లం ఇంటికి వెళ్ళాడు. వారి ఇంట్లో కాచి వేడిచేసిన గంజినీరు పాత్రలో పోసి వుంచగా బాలుడు మోక్షిత్ ఆడుకుంటూ వెళ్ళి ప్రమాదవశాత్తు కాలు పాత్రకి తగిలి అందులోనే పడిపోయాడు. దీంతో మోక్షిత్ పిరుదులకి, వీపు వెనుకభాగంలో కాలి, బొబ్బలు రావడంతో వెంటనే ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ 4వ తేదీ రాత్రి 9.40 గంటలకు మృతిచెందాడు. బాలుని తల్లి మహేశ్వరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## గురుకుల పాఠశాలల ఆకస్మిక తనిఖీ

-విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలి
-జిల్లాకలెక్టర్ హైమావతి



పాఠశాలను పరిశీలిస్తున్న కలెక్టర్ హైమావతి

**హుస్నాబాద్ రూరల్, జూలై 5, ప్రభాతవార్త:**

గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు మెనూప్రకారం భోజనం అందించాలని జిల్లా కలెక్టర్ హైమావతి అన్నారు. శనివారం కోహెడ మండల కేంద్రంలోని సాంఘికసంక్షేమ గురుకుల పాఠశాలతో పాటు హుస్నాబాద్ పట్టణంలోని గిరిజన గురుకుల పాఠశాల, అల్పసంఖ్యాకుల బాలికల గురుకుల పాఠ శాల, జిల్లలగడ్డలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, పోతారం(ఎస్) గ్రామంలోని మహాత్మ జ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఈసంద ర్భంగా హాస్టల్‌లలోని రిజిస్టర్‌లను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి మెనూప్రకారం భోజనం అందిస్తున్నారా, లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ హాస్టల్‌లలో చదువుకునే విద్యార్థుల ఆరోగ్యం పట్ల అధికారులు ప్రత్యేకచొరవ తీసుకోవాలి ఆర్‌బిఎస్ టీమ్‌ల ద్వారా విద్యార్థు లందరికీ వైద్యపరీక్షలు నిర్వహించాలని, అనారోగ్యం, నీరసం ఉన్న విద్యార్థులపట్ల ప్రత్యేకదృష్టి పెట్టాలన్నారు. హాస్టల్‌లలో చదువుకునే బాలికల భద్రత బాధ్యతలు ప్రిన్సిపాల్ తీసుకో వాలని వారిభద్రత విషయంలో ఎక్కడా తగ్గకుండా ఉండాల న్నారు. అనంతరం అన్నిపాఠశాలల్లో వంటగదులను సంద ర్శించి భోజనాలను పరిశీలించారు.

## సిగాచి యాజమాన్యాన్ని అరెస్టుచేయాలి

-ప్రమాదంపై సిట్టింగ్ జడ్జితో న్యాయవిచారణ జరిపించాలి: సిపిఎం




ధర్నా నిర్వహిస్తున్న సిపిఎం నాయకులు

**సంగారెడ్డి మున్సిపాలిటీ, జూలై 5, ప్రభాతవార్త:**

పాశమైలారంలోని సిగాచి కెమికల్ పరిశ్రమలో జరిగిన ప్రమాదంపై సిట్టింగ్‌జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని, తక్షణం మృతుల కుటుంబాలకు కోటి రూపాయల పరిహారం చెల్లించే చర్యలు తీసుకోవాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చుక్క రాములు అన్నారు. బాధిత కుటుంబ సభ్యులకు న్యాయం చేయాలని, గాయపడినవారికి మెరుగైన వైద్యసేవలు, 50లక్షల రూపాయలు చెల్లించాలని కోరుతూ శనివారం సిపిఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి అధ్యక్షతన జిల్లా కలెక్టరేట్ వద్ద సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ సూపరిండెంట్‌కి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా చుక్క రాములు మాట్లాడుతూ పరిశ్రమల్లో సౌకర్యాలపై తనిఖీలు నిర్వహించని అధికారులను సస్పెండ్ చేయాలన్నారు. ప్రమాదానికి కారణమైన పరిశ్రమ యాజమాన్యాన్ని ఇప్పటివరకు అరెస్టుచేయకుండా కాలయాపనచేయడం సరికాదన్నారు. ఈరోజు 11కుటుంబాలకు 5వేల చొప్పున విరాళాలు అందజేశామన్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మల్లేశం, రాజయ్య, మాణిక్, సాయిలు, నర్సింలు, జిల్లాకమిటీ సభ్యులు నాగేశ్వర్‌రావు, విద్యాసాగర్, కృష్ణ, నాయకులు పాండురంగారెడ్డి, నర్సింహారెడ్డి, బాగారెడ్డి, నాగ భూషణం, బాలరాజు, విఠల్, లక్ష్మారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## నాచగిరి క్షేత్ర అభివృద్ధికి కాంగ్రెస్‌ప్రభుత్వ సహకారం

-డిసిసి అధ్యక్షులు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి



లక్ష్మీనృసింహస్వామిని దర్శించుకుంటున్న ఆలయ నూతన పాలకమండలి సభ్యులు

**వర్గల్, జూలై 5, ప్రభాతవార్త:**

నిర్లక్ష్యానికి గురైన నాచగిరి శ్రీలక్ష్మీనృసింహస్వామి క్షేత్ర అభివృద్ధికి కాంగ్రెస్‌ప్రభుత్వ సంపూర్ణ సహకారం ఉంటుందని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు తూంకుంట నర్సారెడ్డి పేర్కొన్నారు. శనివారం నాచగిరి శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయ నూతన పాలక మండలి సన్మాన, అభినందనసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. నాచగిరి అభివృద్ధికి మాస్టర్‌ప్లాన్ సిఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి యాదాద్రి తరహాలో నాచగిరి ఆలయ అభివృద్ధికి తమవంతు కృషిచేస్తామని తెలిపారు. కార్పొరేషన్ మాజీచైర్మన్లు భూంరెడ్డి, ఎలక్షన్ రెడ్డి, నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ ఆవుల రాజిరెడ్డిలు మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి ప్రభుత్వకృషితోపాటు దాతలసహకారం ఎంతో అవసరమని చెప్పారు. భక్తులకు మెరుగైన వసతులు కల్పించడంతోపాటు నాచగిరిని తీర్చిదిద్దే బాధ్యత పాలకమండలిపై ఉందన్నారు. కార్యక్రమంలో దేవాదాయశాఖ సహాయ కమిషనర్ విజయరామారావు, పాలకమండలి సభ్యులు జగ్గయ్యగారి శేఖర్‌గుప్త, దేశపతి ఉషశ్రీ, గాలి కిష్టయ్య, కర్రె పద్మ, సురేందర్‌రెడ్డి, తిరుమల రావు, రుద్ర శ్రీహరి, కొత్తపల్లి శ్రీనివాస్, చందా నాగరాజుగుప్త, ఎక్స్ అఫీషియో సభ్యులు జగన్నాథ ఆచార్యులు, మార్కెట్ కమిటీ చైర్మన్‌లు నరేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, విజయమోహన్, వైస్‌చైర్మన్లు సర్దార్‌ఖాన్, ప్రభాకర్‌గుప్త, ప్రచార కమిటీ చైర్మన్ నిమ్మ రంగారెడ్డి, గజ్వేల్ మున్సిపల్ మాజీ చైర్మన్ రాజమౌళి, మండల పార్టీ అధ్యక్షుడు సందీప్‌రెడ్డి, తమ్మలి శ్రీనివాస్, రవీందర్‌రెడ్డి, ఆలయకమిటీ మాజీ అధ్యక్షుడు నర్సింలుగౌడ్, భాస్కర్‌రెడ్డి, నాయకులు వేమా రెడ్డి, విద్యాకుమార్, మాధవరావు, శ్రీనివాస్, హరినాథ్, నవీన్, వెంకటయ్య, నంగునూరి సత్య నారాయణ, సిద్ది బిక్షపతి, రంగయ్య, విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

## డంపింగ్ యార్డు హటావో జంగల్ బచావో

-151వ రోజుకు చేరుకున్న రిలే నిరాహార దీక్షలు

**గుమ్మడిదల, జూలై 5, ప్రభాతవార్త:**

ప్యారానగర్ డంపింగ్ యార్డు (ఎంఎస్‌డబ్ల్యు)కు వ్యతిరేకంగా రిలే నిరాహారదీక్షలు చేస్తున్నా, రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం స్పందించకపోవడం అన్యాయమని నల్లవల్లి రైతు జెఎసి నాయకులు ఆగ్రహం వ్యక్తంచేశారు. గుమ్మడిదల మండలంలోని నల్లవల్లి గ్రామపంచాయతీ పరిధిలోని ప్యారానగర్ గ్రామ శివారులో ఏర్పాటు కాబోతున్న డంపింగ్ యార్డును ప్రభుత్వం విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన రిలే నిరాహార దీక్ష మంగళవారం 151వ రోజుకు చేరుకుంది. గత ప్రభుత్వం ఇచ్చిన అనుమతులను ప్రస్తుత ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. తమకు న్యాయం జరిగేవరకు పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతు జెఎసి నాయకులు, మహిళా సభ్యులు ప్యారానగర్, నల్లవల్లి, కొత్తపల్లి, గ్రామస్థులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల పేరుతో యథేచ్ఛగా ఇసుక అక్రమరవాణా..!

-రెండు ట్రిప్పులు ఇంటికి .. నాలుగు బయటికి
-ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న ఇసుక మాఫియా
-అక్రమార్కులకు అధికారపార్టీ నాయకుల అండ!?
-తమవంతు సహకారాలు అందిస్తున్న అధికారులు!?
-లబ్దిదారులకు తప్పని ఆర్థికభారం



ఇందిరమ్మ ఇంటి అనుమతి పేరుతో ఇతర నిర్మాణాలకు ఇసుక అన్‌లోడ్ చేస్తున్న దృశ్యం

**హుస్నాబాద్ రూరల్, జూలై 5, ప్రభాతవార్త:**

ఇందిరమ్మ ఇళ్ల పేరిట హుస్నాబాద్ నియోజకవర్గ వ్యాప్తంగా అక్రమ ఇసుకరవాణా యథేచ్ఛగా సాగుతుంది. రాష్ట్రప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల మంజూరైన లబ్దిదారులకు ఇసుకను ఉచితంగా ఇస్తుండగా ఇదే అలుసుగా తీసుకున్న ఇసుక మాఫియా ఇందిరమ్మ ఇళ్లపేరుతో దందా జోరుగా సాగిస్తున్నారు. ఇళ్లవిషయంలో ప్రభుత్వం నిర్దిష్ట మైన ప్రణాళిక చేయకపోవడంతో దొరికిందే అలుసుగా తీసుకుంటున్న అక్రమార్కులు లబ్దిదారుల పేరు చెప్పుకుని ఇతర నిర్మాణాలకు అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్నారు. నిబంధనల ప్రకారం ఇళ్లు మంజూరైన లబ్దిదారులకు గ్రామ పంచాయతీలలో అయితే కార్యదర్శులతోపాటు మున్సిపాలిటీలలో అయితే మున్సిపల్ అధికారులు, రెవెన్యూ సిబ్బంది వారి ఇళ్లను పరిశీలించి అవసరమైన మేరకు కూపన్లు జారీచేయడంతోపాటు ఆ అధికారులు కూపన్లపై అటెస్టేషన్ చేయాల్సి ఉంటుంది. ఇళ్లలబ్దిదారులకు ఇసుక ఉదయం 10గంటల నుండి సాయంత్రం 4గంటలవరకు మాత్రమే సరఫరా చేయాల్సి ఉండగా ట్రాక్టర్ల యజమానులు నిబంధనలకు విరుద్ధంగా ఉదయం, రాత్రి అనే తేడాలేకుండా ఇసుక అక్రమంగా రవాణాచేస్తూ ప్రభుత్వ ఆశయంతోపాటు లబ్దిదారుల ఆశలకు గండికొడుతున్నారు. ఇళ్లు మంజూరైన లబ్దిదారుల పేరు చెప్పుకుంటూ లబ్దిదారునికి రెండు ట్రిప్పుల ఇసుక పోస్తూ మరో నాలుగు ట్రిప్పులు బయట నిర్మాణాలకు అమ్ముకుంటూ వారి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. హుస్నాబాద్ మండలంలో తోటపల్లి, పందిల్లవాగులలో ఇటీవల కురిసిన వర్షాలకు వాగులలో నీరు ఉండడంతో ఇసుక పెద్ద ఎత్తున తీసేందుకు వీలులేకపోవడంతో హుస్నాబాద్ మండలంతోపాటు ఆయాగ్రామాలలో ఇసుక పెద్దయెత్తున అవసరం ఉండగా కోహెడ మండలంలోని నార్లాపూర్, బస్వాపూర్, ఆరెపల్లి, కూరెల్ల, పోరెట్టిపల్లి, పరివేద గ్రామాలతోపాటు చిగురుమామిడి మండలంలోని నవాబుపేట వాగుల్లో నుండి హుస్నాబాద్, కోహెడ, అక్కన్నపేట మండలాలలోని గ్రామాలకు తరలిస్తున్నారు. అనుమతి ఉన్న ఇళ్ల అనుమతిపత్రాలను చూపిస్తూ ఉదయం నుండి సాయంత్రంవరకు ట్రాక్టర్‌లలో తరలించడంతోపాటు రాత్రిసమయంలో హుస్నాబాద్ మండలంలోని పందిల్లగ్రామ శివారులో వారి రహస్య ప్రాంతాలలో ఇసుకను అక్రమంగా డంప్ చేస్తున్నారు.

**అక్రమార్కులకు అధికారపార్టీ నాయకుల అండ!?**

నియోజకవర్గవ్యాప్తంగా ఇందిరమ్మ ఇళ్ల పేరుతో సాగుతున్న ఇసుక అక్రమార్కులకు అధికార పార్టీకి చెందిన నాయకుల అండ ఉందా అంటే అవును అనే చెప్పాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ అక్రమ ఇసుక రవాణా విషయంలో కొంతమంది కాంగ్రెస్ పార్టీకిచెందిన నాయకులే అనుమతులు ఇవ్వాల్సిన అధికారులతో మాట్లాడి వారికి అండగా ఉంటున్నారని, ఇంకాచెప్పాలంటే ఈదందాలో ఎక్కువశాతం వారిభాగస్వామ్యం ఉన్నట్లు తెలుస్తోంది. అధికార పార్టీ నాయకుల భాగస్వామ్యం లేనిప్రాంతాలలో నాయకులకు అక్రమార్కులు ముడుపులు చెల్లిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**సహకారం అందిస్తున్న అధికారులు!?**

పెద్దయెత్తున జరుగుతున్న అక్రమ ఇసుక రవాణా విషయంలో కేవలం అధికార పార్టీల నాయకులే కాకుండా రెవెన్యూ, పోలీస్ సిబ్బంది సైతం వారి సహకారాలను అక్రమార్కులకు అందిస్తూ తమ వంతు పాత్ర పోషిస్తున్నారని పెద్దయెత్తున ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనికి ప్రతికూలంగా అక్రమార్కులనుండి వేలల్లో ముడుపులు అందుకుంటున్నారని తెలుస్తోంది. ఇక రెవెన్యూ అధికారుల విషయానికి వస్తే రాత్రిసమయంలో వారు పంపించే ముడుపులతోనే దాబాలు, రెస్టారెంట్‌లలో కూర్చుని దావత్‌లు చేసుకుంటున్నారని వారి శాఖలోనే తీవ్ర చర్చలు జరుగుతున్నాయి.

**సతమతమౌతున్న ఉన్నతాధికారులు..**

అక్రమ ఇసుకరవాణా విషయంలో అధికారులపై విమర్శలు వస్తున్న నేపథ్యంలో ఈదందాకు అడ్డుకట్టవేయాలనుకునే ఉన్నతాధికారులకు నానా తంటాలు వచ్చిపడుతున్నట్లు అందిన సమాచారం మేరకు తెలుస్తోంది. ముఖ్యంగా ఈరవాణాను అడ్డుకోవాల్సిన రెవెన్యూసిబ్బందితోపాటు ఇతర శాఖల ఉన్నతాధికారులు ట్రాక్టర్‌లను అడ్డుకున్నా, దాచిన దంపులవద్దకు వెళ్లినా ఆయాశాఖల అధికారులకు నాయకులు ఫోన్లుచేసి వదిలేయాలని చెప్తుండడంతోపాటు బెదిరింపులకుసైతం దిగుతున్నారని ఈ విషయంలో ఏంచేయాలోతెలియక అధికారులు సతమతమౌతున్నట్లు తెలుస్తుంది. ఏదియేమైనా అక్రమంగా ఇసుకరవాణాచేస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టడంతోపాటు లబ్దిదారులపై ఆర్థిక భారంమోపుతున్న మాఫియాపై అధికారులు ఎలాంటిచర్యలు తీసుకుంటారో వేచిచూడాల్సిందే.

# వెంకటకిష్టాపూర్‌లో రుక్మిణీపాండురంగస్వామి జాతర

-10వరకు అంగరంగ వైభవంగా జాతర ఉత్సవాలు



శ్రీయంత్రం ఆకారంలో వెంకటకిష్టాపూర్‌లో రుక్మిణీపాండురంగ ఆలయం దృశ్యం

**చౌటకూరు, జూలై 5, ప్రభాతవార్త:**

మండల పరిధిలోని వెంకటకిష్టాపూర్ (దేవుడి అంగడిపేట)లో కొలువున్న శ్రీరుక్మిణీ పాండురంగ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారం నుంచి ప్రారంభం అయ్యాయి. ఆషాఢ మాసం శనివారం దశమి పర్వదినాన్ని పురస్కరించుకుని జాతర ఉత్సవాలు ప్రారంభం అయి గురుపౌర్ణమి వరకు బ్రహ్మోత్సవాలు కొనసాగనున్నాయి. గ్రామంలోని రుక్మిణీపాండురంగస్వామి ఆలయానికి 8వందల ఏళ్ల చరిత్ర ఉంది. 8వందల ఏళ్లక్రితమే గ్రామంలో శ్రీవేంకటేశ్వరస్వామి, లక్ష్మీదేవి కొలువై ఉండి భక్తులచే నిత్యపూజలందుకుంటున్నారు. భక్తులచే నిత్య పూజలందుకుంటున్న లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయాన్ని మొగలాయిదాడుల నేపథ్యంతో ఆలయం పూర్తిగా ధ్వంసం అయింది. మహాసాధువులైన జీవన్ముక్తమహారాజ్, కాశీనాథ్‌మహారాజ్ ఇద్దరూ మహారాష్ట్రలోని పండరిపూర్‌కు వెళ్లి స్వామివారి విగ్రహాలను గ్రామానికి సంకీర్తనలు చేస్తూ తీసుకువచ్చి ఆలయాన్ని పునర్‌నిర్మించి విగ్రహాలను ప్రతిష్ఠించినట్లు పురాణాలు తెలుపుతున్నాయి.

**శ్రీయంత్రం ఆకారంలో దేవాలయం...**

వెంకటకిష్టాపూర్‌లో వెలిసిన దేవాలయమండపం శ్రీయంత్రం ఆకారంలో నిర్మించబడింది. పడమర వైపు ప్రధాన గర్భాలయం, ఎడమ-కుడి వైపులకు ఉపఆలయాలు కలిగి ఉన్నాయి. ఆలయం చుట్టూ ప్రాకారాన్ని నిర్మించారు. కాకతీయులకాలంలోనే ఇటువంటి ఆలయాలు నిర్మించబడ్డాయని పురావస్తుశాఖవారు పేర్కొంటున్నారు. కాలక్రమేణా సద్గురు రాంబావ్ మహారాజ్ ఆజ్ఞమేరకు గురుపరంపర కొనసాగుతున్నది. ఇందులో భాగంగానే దేవాలయంలో విశేషమైన దేవతామూర్తులను ప్రతిష్ఠించారు. సంతాన వేణుగోపాలస్వామి, శివపంచాయతనం, హనుమాన్ గరుత్మంత దేవతామూర్తులను ఆలయంలో ప్రతిష్ఠాపన చేశారు. క్షేత్రానికి శ్రీకాలభైరవస్వామి పాలకుడిగా కొలువై పూజలందుకుంటున్నాడు.

**ఆలయంలో పూజా కార్యక్రమాలు...**

శ్రీరుక్మిణీపాండురంగస్వామి జాతరను పురస్కరించుకుని శనివారం ధాన్యబండాగారం (కోటిపూజ), ధ్వజారోహణం, ఆగ్రప్రదక్షిణ కార్యక్రమాలు నిర్వహించారు. 6న శ్రీరుక్మిణీపాండురంగస్వామికి అభిషేకాలు, అలంకరణ, స్వామివారి నిజపాద స్పర్శదర్శనం (మహారాష్ట్రలోని పండరిపూర్ సంప్రదాయం ప్రకారం) ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, విశేష అలంకరణ, రాజోపచార పూజ, భక్తులకు తీర్థప్రసాదాలు, పల్లకీసేవ నిర్వహిస్తారు. 7న స్వామివారికి కుంకుమార్చన, తులసిమాలతో అలంకరణ కార్యక్రమాలు నిర్వహిస్తారు. 8న ఏకాదశ రుద్రాభిషేకం, అలంకరణ, దేవాలయ క్షేత్రపాలకుడు శ్రీకాలభైరవస్వామికి రుద్రాభిషేకం, భస్మాభిషేకం, భస్మప్రసాద వితరణ అనంతరం రాత్రికి గోపాల కాల్వాలు (పెరుగు వసంతం), పల్లకీసేవ, 9న స్వామివారికి అభిషేకం, విశేష అలంకరణ, ఉదయం 11గంటల నుంచి శ్రీరుక్మిణీపాండురంగస్వామి కళ్యాణం రథోత్సవం, 10న స్వామివారికి ప్రాతఃకాల పూజ, తీర్థప్రసాద వితరణ, గురుపూజ, గురువు వారి లక్షపూల పాదపూజ మొదలైన కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

# ప్రతిష్ఠాత్మకంగా ఆయిల్ పాం సాగు

-జిల్లాలో 6500ఎకరాల లక్ష్యాన్ని పూర్తిచేయాలి
-కలెక్టర్ హైమావతి



సమీక్షాసమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హైమావతి

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**

రాష్ట్రప్రభుత్వం ఆయిల్‌పాం సాగు అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుందని జిల్లాకు ఇచ్చిన 6500 ఎకరాలలక్ష్యాన్ని తప్పనిసరిగా పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ హైమావతి సూచించారు. జిల్లా కలెక్టరేట్‌లో శనివారం ఆయిల్‌ఫెడ్, వ్యవసాయ, ఉద్యానవనశాఖ అధికారులతో అమె సమీక్షాసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అమె మాట్లాడారు. క్షేత్రస్థాయిలో అధికారులు రైతుల ఇంటికీవెళ్లి ఆయిల్‌పాంవలన కలిగేలాభాలు తెలిపి ప్రేరణ కల్పించాలన్నారు. గ్రామాల్లో ఆయిల్‌పాం సాగుపై పెద్దయెత్తున ప్రచారం చేయాలన్నారు. ఆయిల్‌పాం సాగులో దశలు రైతులను ఎంపిక చేయడం డిడి కలెక్షన్లు, మార్కింగ్, డ్రిప్ ఫిట్టింగ్, మొక్కలుపెట్టే ప్రక్రియను వెంటవెంటనే పూర్తి చేయాలన్నారు. పెద్దభూస్వాములుకాకుండా చిన్న, సన్నకారు రైతులను సైతం ఆయిల్‌పాం వైపు మళ్లించాలన్నారు. వ్యవసాయ, ఉద్యానవనశాఖ, ఆయిల్‌ఫెడ్ కార్పొరేషన్ అధికారులు రైతువేదిక, డివిజన్ స్థాయిలో సమావేశాలు నిర్వహించి రైతులను ప్రోత్సహించాలన్నారు. అధికారులు సమన్వయంతో పనిచేస్తూ వందశాతం లక్ష్యాన్ని పూర్తిచేయాలని ఆదేశించారు. ఫార్మసీరిజిస్ట్రీ పూర్తి చేసి జిల్లారైతులకు కేంద్రం అందించే అన్నిసౌలభ్యాలు అందేలా పనిచేయాలని ఆదేశించారు. జిల్లాలో ఫర్టిలైజర్ దుకాణాల పర్యవేక్షణ పూర్తి చేయాలన్నారు. సమావేశంలో ఆయిల్‌ఫెడ్ జాయింట్ డైరెక్టర్ సునీత, వ్యవసాయాధికారి రాధిక, ఉద్యానవనశాఖ అధికారి సువర్ణ, ఆయిల్‌పాం ఫ్యాక్టరీ మేనేజర్ శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

**సాంఘికసంక్షేమ, మహాత్మా జ్యోతిబాపూలే బాలికల, బాలుర పాఠశాలలు, కాలేజీల ఆకస్మికతనిఖీ..**

కలెక్టర్ హైమావతి శనివారం జిల్లావ్యాప్తంగా విస్తృతంగా పర్యటించి తెలంగాణ సాంఘిక సంక్షేమగురుకుల, మహాత్మాజ్యోతిబాపూలే, బాలిక, బాలురుల పాఠశాలలు, ఇంటర్, డిగ్రీ కళాశాలను ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. జిల్లాలోని కొండపాక, చేర్యాల, సిద్దిపేట అర్బన్, కోహెడ, హుస్నాబాద్, నారాయణరావుపేట తదితర మండలాల్లోని గురుకులపాఠశాలలు, కాలేజీలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈసందర్భంగా విద్యార్థులసమస్యలు అడిగి తెలుసుకోవడంతోపాటు విద్యార్థులకు అందుతున్నభోజనంపైఆరాతీసి వంటగదులను, పరిసర ప్రాంతాలను పరిశీలించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూసుకోవాలని ప్రిన్సిపాళ్లను ఆదేశించారు.

# విద్యార్థుల భద్రత, వసతులపై ప్రత్యేక దృష్టి ఉంచాలి

-సాంఘిక సంక్షేమశాఖ రెసిడెన్షియల్ బాలికలపాఠశాలను తనిఖీచేసిన కలెక్టర్



సాంఘిక సంక్షేమ శాఖ రెసిడెన్షియల్ బాలికల పాఠశాలను తనిఖీ చేస్తున్న కలెక్టర్ పి.ప్రావీణ్య

**పటాన్‌చెరు, జూలై 4, ప్రభాతవార్త:**

పటాన్‌చెరు మండలం, ఇస్నాపూర్ సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ బాలికలపాఠశాలను సంగారెడ్డి జిల్లాకలెక్టర్ ప్రావీణ్య శనివారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. విద్యార్థులకు అందుతున్న వసతులు, హాస్టళ్ల పరిశుభ్రత, ఆహారనాణ్యత, బోధనావిధానాన్ని పరిశీలించారు. ఈసందర్భంగా కలెక్టర్ విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడారు. సమస్యలు, అవసరాలు, అభిప్రాయాలు స్వయంగా తెలుసుకున్నారు. మీభవిష్యత్తు బాగుండాలి అంటే బాగాచదవాలి, ధైర్యంగా ఉండాలని అన్నారు. విద్యార్థులభద్రత, మౌలికవసతుల మెరుగుదల కోసం తక్షణచర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తనిఖీల్లో భాగంగా టాయిలెట్లు, భోజనశాల, వసతిగృహాలను పరిశీలించి అవసరమైన అభివృద్ధిపై అధికారులకు సూచనలుచేశారు. ప్రతివిద్యార్థి ఆరోగ్యంగాభద్రంగాఉండేలా పాఠశాలవాతావరణం ఉండాలన్నారు. పాఠశాలలో శుభ్రత, పారిశుద్ధ్యంపై రోజువారీ పర్యవేక్షణ నిర్వహించాలని పేర్కొన్నారు. విద్యార్థులు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను వినియోగించుకొని కష్టపడిచదివి ఉన్నతస్థాయికి చేరాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, ఇతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి

### - మాజీ కార్పొరేటర్ కోలన్ వీరేందర్ రెడ్డి



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న వీరేందర్‌రెడ్డి

**నిజాంపేట్, జూలై, ప్రభాతవార్త**

ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతం కృషి చేస్తానని మాజీ కార్పొరేటర్ కోలన్ వీరేందర్ రెడ్డి అన్నారు. శనివారం 18వ డివిజన్లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను మాజీ కార్పొరేటర్ కోలన్ వీరేందర్ రెడ్డి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానికంగా చేపట్టే పలు అభివృద్ధి పనులలో నాణ్యత ప్రమాణాలు తుచా తప్పకుండా పాటించాలని కాంట్రాక్టర్ కు సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా త్వరితగతిన పనులు పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని తెలిపారు. ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ, సమస్యలు లేని డివిజన్‌గా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీకాంత్, రంజీత్, విజయ్, పాల్గొన్నారు.

## దేశసేవపై విద్యార్థులకు అవగాహన కల్పించాలి



ఆర్మీ అధికారుల నుండి సి సర్టిఫికెట్ అందుకున్న ఇంగ్లీష్ యూనియన్ ఎన్‌సీసీ విద్యార్థులు

**ముషీరాబాద్, జూలై 5, ప్రభాతవార్త:** దేశ సేవ గురించి విద్యార్థులకు చిన్నతనం నుండే అవగాహన కల్పించాలని ఇంగ్లీష్ యూనియన్ స్కూల్ కరస్పాండెంట్ పులిగారి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. శనివారం కవాడిగూడలోని ఇంగ్లీష్ యూనియన్ స్కూల్ లోని ఎన్‌సీసీ విద్యార్థులకు ఆర్మీ అధికారులు సి సర్టిఫికెట్‌లు అందచేశారు. ఈ సందర్భంగా గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్‌సీసీ కాడెట్స్ ట్రైనింగ్ పూర్తి చేసిన విద్యార్థులకు ఆర్మీ అధికారుల చేతుల మీదగా సి సర్టిఫికెట్లు అందచేయటమే కాకుండా విద్యార్థులకు డిఫెన్స్ సర్వీస్‌ల పై అవగాహన కల్పించటం జరిగిందని తెలిపారు.

## దాతల సహకారంతో పేద విద్యార్థినికి ఆర్థిక సహాయం



విద్యార్థినికి ఆర్థిక సహాయం అందజేస్తున్న దృశ్యం

**జగద్గిరిగుట్ట, జూలై, ప్రభాతవార్త**

హార్ట్ టూ హెల్ప్ చారిటబుల్ ట్రస్ట్ అధ్వర్యంలో దాతల సహకారంతో పేద విద్యార్థినికి ఆర్థిక సహాయాన్ని అందజేశారు. శనివారం విద్యుత్ శాఖలో అసిస్టెంట్ ఇంజనీర్ గా చేస్తున్న జి. లక్ష్మి తను పుట్టినరోజు సందర్భంగా విద్యార్థినికి ఆర్థిక సహాయాన్ని అందజేశారు. జగదిరిగుట్టకు చెందిన శేఖర్ అనారోగ్య కారణంగా చనిపోవడంతో ఆ కుటుంబ పెద్దను కోల్పోయింది. రాధా హాస్పిటల్లో సెక్యూరిటీగా పనిచేస్తూ ఇద్దరూ కుమార్తెలను చదివిస్తుంది. తుడి లిఖిత ఎం.ఎల్.ఆర్ ఇన్స్టిట్యూషన్ ఆఫ్ టెక్నాలజీలో బీటెక్ (డేటా సైన్స్) విభాగంలో మొదటి సంవత్సరం చదువుతుంది. సంవత్సరానికి 2 లక్షల ఖర్చు అవుతుంది వాళ్ల కుటుంబ ఆర్థిక పరిస్థితి మాకు వివరించడంతో మేము స్పందించి దాతలు సహకారంతో విద్యార్థినికి రూ. 5000 ఆర్థిక సాయం అందిస్తున్నట్లు ట్రస్ట్ అధ్యక్షులు మూడే రవి నాయక్ తెలిపారు. దాత జి. లక్ష్మి గత 15 సంవత్సరాలుగా తన పుట్టినరోజు సందర్భంగా ఎంతో మంది విద్యార్థులకు ఆర్థిక సహాయంతో, స్టడీ మెటీరియల్ తో పాటు అనాధాశ్రమాలకు చేయూతను అందిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సత్యనారాయణ, సోమ నరసమ్మలు పాల్గొన్నారు

## ప్రత్యేక రాష్ట్ర సాధనలో కళాకారుల పాత్ర కీలకం

### -తెలంగాణ ఉద్యమ కళాకారుల వేదిక రాష్ట్ర కమిటీ సమావేశం



ప్రసంగిస్తున్న తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ సెక్రటరీ జనరల్ తుమ్మల ప్రఫుల్‌రాంరెడ్డి

**చిక్కడపల్లి, జూలై 5 ప్రభాతవార్త:** తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన కళాకారుల కోసం ప్రభుత్వం అండగా నిలవాల్సిన అవసరం ఉందని తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ సెక్రటరీ జనరల్ తుమ్మల ప్రఫుల్‌రాంరెడ్డి అన్నారు. ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో కళాకారులు ఎంతో మంది తమ జీవితాలను త్యాగం చేశారన్నారు. శనివారం బాగ్‌లింగంపల్లిలో తెలంగాణ ఉద్యమ కళాకారుల వేదిక రాష్ట్రస్థ కమిటీ ఆధ్వర్యంలో సాంస్కృతిక సమావేశం వేముల యాదగిరి, కాంపల్లి సాయిలు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్రంలో అన్ని జిల్లాలకు సంబంధించి జిల్లాల కన్వీనర్‌లను ఎన్నుకున్నారు. వరంగల్, సిద్దిపేట, గజ్వేల్, నాగర్‌కర్నూలు, మెదక్, సంగారెడ్డి, భువనగిరి, రంగారెడ్డి జిల్లా కన్వీనర్, కోన్వీనర్‌లుగా కొయ్యడ రాజేష్, స్వరూప రాణి, బాల్‌లక్ష్మయ్య, యాదగిరి, చంద్రకళ, కాంపల్లి సాయిలు, మాదుగల వెంకటయ్య, కొండలు, యాదగిరి, రేణుక, సుగుణమ్మ, లావణ్య, ఇందిరలను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో టియుజేఏసీ కోశాధికారి చంద్రన ప్రసాద్, తెలంగాణ ఉద్యమ విద్యార్థి జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు కంచర్ల బద్రి, మహిళావేదిక ప్రధాన కార్యదర్శి లావణ్య యాభై మంది ఉద్యమకారులు పాల్గొన్నారు.

## డివిజన్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుతున్నాం

### -ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్, కార్పొరేటర్ అర్చన జయప్రకాష్



**అత్తాపూర్ జూలై 5, ప్రభాతవార్త :** రాజేంద్రనగర్ డివిజన్ ఆదర్శంగా తీర్చిదిద్దుతున్నామని ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్,కార్పొరేట్ అర్చన జయప్రకాష్ లు పేర్కొన్నారు. రాజేంద్రనగర్ పరిధిలోని విశ్వస్ నగర్ కాలనీ హైదర్ ఎన్‌క్లేవ్‌లో 19లక్షల రూపాయలతో మురుగు నీటి పైపులైన్ పనులను ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్,కార్పొరేటర్ అర్చన జయప్రకాష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.....డివిజన్ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నామని డివిజన్‌లో అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు,స్థానికులు నాయకులు,పాల్గొన్నారు.

# మణికొండలో జోరుగా సెల్లార్ల తవ్వకాలు

- అధికారులకు కాసులు కురిపిస్తున్న సెల్లార్లు
- వర్షాకాలంలో సెల్లార్లు తవ్వకూడదన్న నిబంధనలకు తూట్లు
- ప్రాణాలు పోతున్నా పట్టించుకోని అధికారగణం
- సెల్లార్లు తవ్వితే ఇంటి అనుమతులు రద్దు చేస్తాం : కమిషనర్



మణికొండ మున్సిపాలిటీలో జోరుగా సాగుతున్న సెల్లార్ల తవ్వకాల దృశ్యాలు.

**నార్సింగి, జూలై 5 ప్రభాతవార్త :** మణికొండ మున్సిపాలిటీ పరిధిలో జోరుగా సెల్లార్ల తవ్వకాలు సాగుతున్నాయి. వర్షాకాలంలో సెల్లార్లు తవ్వకూడదని ప్రత్యేకంగా ఓ జీవో ఉన్నా దాన్ని నిర్మాణ దారులు లెక్క చేయడం లేదు. సెల్లార్ల తవ్వకాలను అడ్డుకునే అధికారం ఉన్న అధికారులు కాసులకు కక్కుర్తి పడి చూసీ, చూడనట్లు నటిస్తున్నారు. అధికారులకు అడిగినంతా ముట్టజెప్పుతున్నాం ఇక మనలను అడేగే వారు లేరంటూ నిర్మాణం దారులు రెచ్చిపోతున్నారు. 20.కిపైగానే మణికొండలో సెల్లార్లు తవ్వుతున్నారు. అధికారుల పాలనలో జవాబుదారి తనం లోపించిందన్న వాదనలు వినిపిస్తున్నాయి. ప్రజా ప్రతినిధుల పదవులు ముగియడంతో వారు ఇళ్లకే పరిమితం అవుతున్నారు. ఇప్పుడు అధికారులు ఏమనుకుంటే అదే చట్టం అన్న చందంగా మారిపోయింది. సిరులు కురిపిస్తున్న సెల్లార్లను మున్సిపల్ కమీషనర్‌గాని, టౌన్‌ప్లానింగ్ అధికారులు గాని పట్టించుకోవడం లేదు. పలుమార్లు స్థానికులు ఈ సెల్లార్ల వలన కూలీల ప్రాణాలు పోయే ప్రమాదముందని, అడ్డుకోండని సూచించినా అధికారులలో చలనమే లేదు. చూస్తాము, చేస్తాము, నోటీసులు ఇస్తాము అంటూ కాలయాపన చేస్తున్నారు. అధికారుల పరోక్ష మద్దతుతో భవన నిర్మాణదారులు నిబంధనలు తుంగలో తొక్కి అడ్డగోలుగా సెల్లార్లను తవ్వేస్తున్నారు. మణికొండలోని పంచవటి కాలనీ, అల్కాపూర్ కాలనీ, వెంకటేశ్వరకాలనీలలో జోరుగాసెల్లార్ల తవ్వకం సాగుతుంది.

**కూలీల ప్రాణాలకన్నా కాసులకే ప్రాధాన్యత ఇస్తున్న అధికారులు**

వర్షాకాలంలో తవ్వే సెల్లార్ల వలన మట్టిదిబ్బలు మీద పడి తరుచూ వసల కూలీలు ప్రాణాలు కోల్పోతున్నారు. కూలీల ప్రాణాలు కాపాడేందుకే ప్రభుత్వాలు వర్షాకాలంలో మూడు నెలల పాటు సెల్లార్లు తవ్వకూడదని ప్రత్యేకంగా ఓ జీవో తీసుకు వచ్చి, రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీలు ఈ నిబందనలు తప్పకుండా పాటించాలని ఆదేశాలు జారీ చేశాయి. ప్రభుత్వ ఆదేశాలను పాటించాల్సిన మున్సిపల్ కమీషనర్లు, టౌన్‌ప్లానింగ్ అధికారులు పట్టించుకోవడం లేదు. కూలీల ప్రాణాలకన్నా కాసులకే అధిక ప్రాధాన్యతనిస్తున్నారు. మణికొండలో పెద్ద ఎత్తున సాగుతున్న సెల్లార్ల తవ్వకం చూస్తుంటే ఇదే నిజమనిపిస్తుంది. కొన్ని సెల్లార్లలో మూడు ఫీట్ల మేర వర్షపు నీరు నిలిచిపోయింది. చిన్న పిల్లలు ఆడుకునేందుకు వెళ్లి ఆ నీటిలో పడి ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉంది. 150.గజాల నుంచి వెయ్యి గజాల వరకున్న ప్లాట్లన్నింటిలో సెల్లార్లు తవ్వేస్తున్నారు. సెల్లార్ల కోసం అనుమతులు ఇవ్వకున్నా భవన నిర్మాణందారులు యధేచ్చగా సెల్లార్లు తవ్వుతున్నారు. నిత్యం ఏరియాల్లో తిరిగే మున్సిపల్ జవాన్లకు ఈ విషయం తెలిసినా, టౌన్‌ప్లానింగ్ అధికారికి, కమీషనర్‌కు తెలిసినా స్పందిచకపోవడం వారి అలసత్వంకు, పరోక్ష మద్దతుకు నిదర్శనం.

**ఐదారుగు మరణించినా అలసత్వం వీడరా?**

ఇదే మణికొండలో గతంలో సెల్లార్లు తవ్వుతుండగానే పెద్ద ఎత్తున మట్టికుప్పలు కూలి పైన పడడంతో ఐదారుగురు దుర్మరణం చెందారు. 25. జూన్ 2022న మణికొండలోని ఇపిల్ వద్ద సెల్లార్లు తవ్వుతుండగా శ్రీకాకుళం నుంచి బతుకు దెరువు కోసం వచ్చిన ప్రసాద్, వెంకటరమణలు మట్టిపెల్లలు పైన పడి సంఘటనా స్థలంలోనే దుర్మరణం చెందారు. ఇదే మణికొండలో మరో రెండు సంఘటనలలో ముగ్గురు కన్నుమూశారు. తరుచూ ఇలాంటి సంఘటనలు చోటు చేసుకుంటున్నా, పొట్ట చేతపట్టుకొని వచ్చిన వసల కూలీలు సమిధలవుతున్నా టౌన్‌ప్లానింగ్ అధికారులలో కదలిక రాకపోవడం విచారకరం. కూలీలు మట్టి దిబ్బల కింద సమిధలవ్వకుండా ఉండాలంటే. ఇప్పటికైనా మున్సిపల్ శాఖకు చెందిన పైస్థాయి అధికారులు స్పందించి మణికొండలో యధేచ్చగా సాగుతున్న సెల్లార్ల తవ్వకం పర్వానికి తెర వేయాల్సిన అవసరం ఉంది.

### కమిషనర్ వివరణ :

మణికొండలో జోరుగా సాగుతున్న సెల్లార్ల తవ్వకాలపై కమీషనర్ ప్రదీప్ కుమార్‌ను ప్రభాతవార్త వివరణ అడిగితే నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠినమైన చర్యలు తీసుకుంటామని వివరించారు. 20.వరకు సెల్లార్లు తవ్వుతున్న యజమానులకు నోటీసులు ఇచ్చామని, వెంటనే పనులు ఆపకపోతే అనుమతులు రద్దు చేస్తామని హెచ్చరించారు. ఈ మూడు నెలలు ఎవరు సెల్లార్లు తవ్వినా ఉక్కుపాదం మోపుతామని కమీషనర్ ప్రదీప్ కుమార్ స్పష్టం చేశారు.

## విద్యార్థి దశ నుండే నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి : వంశీకృష్ణ రెడ్డి

**జీడిమెట్ల, జూలై, ప్రభాతవార్త**

విద్యార్థి దశ నుండే నాయకత్వ లక్షణాలు క్రమశిక్షణ పట్టుదల జిజ్ఞాస వంటి అలవాట్లను అలవర్చుకొని గొప్ప విద్యార్థులుగా రాణించాలని టీవీఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ మేనేజింగ్ డైరెక్టర్ టీ వంశీకృష్ణ రెడ్డి అన్నారు. శనివారం టీవీఆర్ మోడల్ హై స్కూల్ అపురూప కాలనీలో టీవీఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ మేనేజింగ్ డైరెక్టర్ టీ వంశీకృష్ణ రెడ్డి ఆధ్వర్యంలో ఇన్వెస్టిట్యూర్ సిరెమోనీ (క్రమశిక్షణ మండలి) ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపల్ ఎం జయరాజ్ ఆధ్వర్యంలో స్కూల్ క్యాబినెట్ స్టూడెంట్స్ కి ఎలక్షన్ నిర్వహించి ఓటింగ్ ద్వారా స్టూడెంట్స్‌ని ఎన్నుకున్నారు. హెడ్ బాయ్ గోవింద నందన్ హెడ్ గర్ల్ తనుశ్రీ, సీసీఏ, వైష్ణవి, సంచిత్ వాంకడే, స్పోర్ట్స్ కెప్టెన్ రష్మీ దశ, జితేందర్ వర్మ లను స్టూడెంట్ క్యాబినెట్ లీడర్స్‌గా ఎన్నుకొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎల్ టి కోల్ పియుష్ షా (లెఫ్టినెంట్ కల్నల్ పీయూష్ షా) పాల్గొని వారి చేతుల మీదుగా విద్యార్థిని విద్యార్థులకు బ్యాడ్జెస్, స్లాషేస్ అందజేశారు. ఈ కార్యక్రమానికి విద్యార్థులను సిద్ధహస్తులుగా తీర్చిదిద్దిన వ్యాయామ ఉపాధ్యాయులను అభి నందించారు. టీవీఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ చైర్మన్ టీ కోటి రెడ్డి, అకా డమిక్ డైరెక్టర్ దీప్తి రెడ్డి, విద్యార్థిని విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థులు అధ్యాపక బృందం పాల్గొన్నారు.

### ప్రేమిస్తున్నానని మోసం చేసిన ఆటోడ్రైవర్ అరెస్ట్

**హైదరాబాద్,జూలై5, ప్రభాతవార్త:** ప్రేమిస్తున్నాని యువతి వెంటపడి శారీరకంగా దగ్గరై గర్భవతిని చేసి మొహం చాటేశాడు ఓ వివాహితుడు. దీంతో మోసపోయానని మానసిక క్షోభను అనుభవించి చివరకు తనువుచాలించింది. ఈ ఘటన నాచారం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. కుటుంబసభ్యుల ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్ట్ చేశారు. పోలీసులు వివరాల ప్రకారం నాచారానికి చెందిన మహేందర్ ఆటోను నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. దీంతో సమీపంలోని ఉండే ఓ యువతి కోచింగ్‌కు నిత్యం రాకపోకలు సాగిస్తుండడంతో పరిచయం ఏర్పడి కాస్తా ప్రేమగా మారింది. అయితే అప్పటికే సదరు ఆటోడ్రైవర్‌కు వివాహమై పిల్లలున్నారు. యువతికి పెళ్లి చేసుకుంటానని మాయమాటలతో లోబర్చుకుని శారీరకంగా దగ్గరై కోరికను తీర్చుకున్నాడు. దీంతో యువతి గర్భందాల్చడంతో ఫోన్‌లో అతన్ని పెళ్లి గురించి అడగగా నిరాకరించడంతో కుటుంబసభ్యులకు వివరించింది. ఇంట్లో ఒంటరిగా ఉన్న సదరు యువతి ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేయడంతో సదరు ఆటోడ్రైవర్‌పై పలు కేసులు వెలుగుచూశాయి. నిందితుడిని అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించారు.

## మణికొండలో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట :ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

**నార్సింగి, జూలై 5 ప్రభాతవార్త :** మణికొండ మున్సిపాలిటీలో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నామని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ పేర్కొన్నారు. శనివారం మణికొండలోని వివిధ కాలనీలో రూ.7.కోట్ల 77.లక్షలతో చేపట్టిన అభివృద్ధి పనుల శంఖుస్థాపనలు, ప్రారంభోత్సవాలను కమీషనర్ ప్రదీప్ కుమార్, మాజీ చైర్మన్ కస్తూరి నరేందర్ ముదిరాజ్, మాజీ వైస్ చైర్మన్ కె.నరేందర్‌రెడ్డిలతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజధాని నగరానికి ఆనుకొని ఉన్న మణికొండను రాజధానికి ధీటుగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. వేగంగా ప్రజల సమస్యలు పరిష్కరిస్తూ, అంతే వేగంగా అభివృద్ధి పనులు చేయిస్తున్నామన్నారు. వర్షాకాలంలో అంటు వ్యాధులు వ్యాపించకుండా పారిశుద్య విభాగం అప్రమత్తంగా విధులు నిర్వహించాలని సూచించారు. మురుగు నీరు, చెత్త నిలువ ఉండకుండా చూడాలని ఆదేశించారు. వరదల సమయంలో మ్యాన్‌హోళ్లు తెరిస్తే అవి మూసే వరకు కార్మికులు అక్కడే విదులు నిర్వహించాలన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని ఎమ్మెల్యే సూచించారు. శనివారం రూ.42.లక్షలతో శివనగర్ కమ్యూనిటీహాల్, రూ.కోటితో అల్కాపూర్‌లోని పార్కు-1.ను అభివృద్ధి చేయించారు. అలాగే రూ.75.లక్షలతో స్పెక్ట్రమ్ విల్లాస్ వద్ద బాక్స్ కల్వర్ట్ పనులను ప్రారంభించారు. రూ.50.లక్షలతో వెంకటేశ్వర కాలనీలో సీసీ రోడ్డుకు శంఖుస్థాపన, అలిజాపూర్‌లో రూ.50.లక్షలతో సెంట్రల్ మీడియన్‌కు శంఖుస్థాపన, రూ.కోటి 25.లక్షలతో నిర్మించిన శివాజీ నగర్ కమ్యూనిటీహాల్ ప్రారంభోత్సవం, రూ.2.కోట్ల 75.లక్షలతో నిర్మించిన జల మండలి, ఎస్‌బి కార్యాలయం కమ్యూనిటీహాల్‌లను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ తలారి మల్లేష్ ముదిరాజ్, మాజీ ఫ్లోర్ లీడర్ కొండకళ్ల రామకృష్ణారెడ్డి, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జితేందర్, నార్సింగి మార్కెట్ కమిటీ చైర్మన్ వేణుగౌడ్, నాయకులు యాలాల నరేష్, పద్మారావ్, సాయిరెడ్డి, శ్రీరాములు, బషీర్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మణికొండలో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్.

# డిజిటల్ అరెస్ట్ అంటూ..నగరంలో రూ.53లక్షలు లూటీ..

**అమీర్‌పేటకు చెందిన 77 ఏళ్ల వృద్ధుడికి సైబర్ నేరగాళ్ల వల..**

**హైదరాబాద్, జూలై 5 ప్రభాతవార్త :** నగరంలో సైబర్ నేరగాళ్లు మరోసారి విజృంభించారు. 'డిజిటల్ అరెస్ట్' పేరుతో సరికొత్త మోసానికి పాల్పడి, అమీర్‌పేటకు చెందిన 77 ఏళ్ల వృద్ధుడి నుంచి రూ. 53 లక్షలు కొల్లగొట్టారు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఈ మోసం వెలుగులోకి వచ్చింది. గత నెల 18న బాధితుడికి ఒక గుర్తుతెలియని నంబర్ నుంచి ఫోన్ వచ్చింది. అవతలి వ్యక్తి తాను ఢిల్లీ డీసీపీ రాజీవ్ కుమార్‌ను అని పరిచయం చేసుకున్నాడు. బాధితుడిపై మనీలాండరింగ్ కేసు నమోదైందని, అరెస్ట్ వారెంట్ కూడా జారీ అయిందని నమ్మబలికాడు. వెంటనే బ్యాంకు ఖాతాలను ఫ్రీజ్ చేస్తామని బెదిరించాడు. తన మాటలను బాధితుడు నమ్మేలా చేయడానికి, బ్యాంకు ఖాతాలను నిలిపివేయాలని సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసినట్లుగా ఒక నకిలీ ఆర్డర్ కాపీని వీడియో కాల్‌లో చూపించాడు. దీంతో తీవ్ర ఆందోళనకు గురైన వృద్ధుడు, తనపై కేసు నమోదు చేయవద్దని వారిని వేడుకున్నాడు. ఇదే అదనుగా భావించిన నేరగాళ్లు, కేసు నుంచి బయటపడాలంటే తమకు సహకరించాలని సూచించారు. ఖాతాలోని డబ్బును తాము చెప్పిన అకౌంట్‌కు బదిలీ చేస్తే వాటిని పరిశీలించి తిరిగి జమ చేస్తామని మాయ మాటలు చెప్పారు. వారి మాటలు నమ్మిన బాధితుడు విడతల వారీగా రూ. 53 లక్షలను వారు చెప్పిన ఖాతాలకు బదిలీ చేశాడు. డబ్బులు అందిన వెంటనే సైబర్ నేరగాళ్లు వీడియో కాల్ కట్ చేసి ఫోన్ స్విచ్ఛాఫ్ చేశారు. ఎంత ప్రయత్నించినా వారి నుంచి స్పందన లేకపోవడంతో తాను మోసపోయానని గ్రహించిన బాధితుడు హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

**మరోకేసులో..క్రెడిట్ కార్డు లిమిట్ పెంచుతామంటూ వృద్ధుడికి టోకరా..**

క్రెడిట్ కారునడ లిమిట్ పెంచుతామంటూ నగరంలోని షేక్‌పేటకు చెందిన 67 ఏళ్ల వృద్ధుడిని సైబర్ నేరగాళ్లు మోసగించారు. హెచ్‌డిఎఫ్‌సీ బ్యాంక్ కస్టమర్ కేర్ నుంచి మాట్లాడుతున్నామంటూ వృద్ధుడికి వీడియో కాల్ చేశారు. క్రెడిట్ కార్డు లిమిట్ పెంచుతామని, స్క్రీన్ షేరింగ్ ఇవ్వాలని లింక్ పంపారు. కాల్‌లో ఉండగానే వివరాలు ఎంటర్ చేయాలని సైబర్ నేరగాళ్లు వృద్ధిడికి చెప్పారు. వివరాలు ఎంటర్ చేయగానే లిమిట్ 2.5లక్షలకు పెరిగిందని..24 గంటల్లో అప్‌డేట్ అవుతుందని చెప్పి ఫోన్ కట్ చేశారు. వెంటనే రూ.2.03 లక్షలు ఖాతా నుంచి డెబిట్ అవ్వడంతో వృద్ధుడు ఆందోళనకు గురయ్యాడు. మోసపోయానని గ్రహించి హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## రిజిస్ట్రేషన్ చేయిస్తానంటూ డబ్బులు తీసుకొని మోసగించిన డాక్యుమెంట్ రైటర్

### -కమిషనర్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ రిజిస్ట్రేషన్ అండ్ స్టాప్ శాఖకు బాధితుడు బత్తుల బెనర్జీ వినతి

**గోషామహల్, జూలై 5ప్రభాతవార్త:** తన ప్లాట్ సంబంధించి రిజిస్ట్రేషన్ చేయడానికి చిక్కడ పల్లి సబ్ రిజిస్ట్రేషన్ వద్ద సిరి అసోసియేట్ డాక్యుమెంట్ రైటర్ పుట్ట హరిబాబు నకిలీ రశీద్‌ను సృష్టించి తననుమోసగించారు. రిజిస్ట్రేషన్ చేయిస్తానంటూ తన వద్ద నుంచి ఐదులక్షల రూపాయలపైగా తీసుకుని ఫోర్జరీరశీద్ ఇచ్చిన అతనిపై చట్టారీత్యా చర్యలు తీసుకోవాలని బాధితుడు ప్రభుత్వ ఉద్యోగి బత్తుల బెనర్జీ కోరారు. ఈమేరకు రాష్ట్ర కమీషనర్, ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ రిజిస్ట్రేషన్, అండ్ స్టాంప్‌శాఖ ఆర్‌జీ హనుమంతుని కలిసి బెనర్జీ వినతిప్రతం ఇచ్చారు. గగన్‌మహల్ దోమల్‌గూడ నివాసి అతని వద్దకు వెళ్లగా ప్లాట్ రిజిస్ట్రేషన్ చేస్తానని, నమ్మబలికించి తన వద్ద నుంచి 5లక్షల 24,300 లక్షలుతీసుకున్నాడు. తర్వాత నకిలీ రశీద్ ఇచ్చాడు. వెంటనే తానుచాలన్ రశీద్ తీసుకుని నెంబర్ 199 కెడిడబ్ల్యు010624 తీసుకుని చిక్కడపల్లిలని సబ్ రిజిస్ట్రేషన్ ఆఫీస్ వెల్లి, రశీద్‌ను చూపించగా అది అసలు రశీదుకాదు, పోర్జరీ నకిలీ చేసిన చాలన్ అని తేల్చారు. దీంతో అక్రమార్కుడి చేతిలో మోసపోయానని నిర్ధారించుకుని తాను ఒకసారిగా దిగ్భ్రాంతికి గురయ్యానని వెళ్లి హరిబాబును నిలదీయగా సారి టెక్నికల్ తప్పు జరిగిందని భావించి వాపస్ చేయాలని వత్తిడి పెంచాడు. హరిబాబు డబ్బులు ఇవ్వకుండా 742946 నెంబర్ చెక్కు ఇచ్చాడు. దీన్ని తీసుకుని బ్యాంకు వెల్లి బ్యాంకులో వేయగా చెక్కుబౌన్స్ అయ్యిందన్నారు. ఇలా ఎంతమందిన్ని హరిబాబు మోసం చేసి ఉండవచ్చునని అనుమానం వ్యక్తం చేశారు. ఈవిషయాన్ని నగర పోలీసు కమీషనర్, ఇతర ఉన్నతాధికారులకు వినతి పత్రాలు అందచేసినట్లు తెలిపారు. తనకు న్యాయం చేయాలని కోరారు.

## నిరాశ్రయులైన వారిని ఆదుకోవడం మంచి సంప్రదాయం

### -అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గోనె సల్మాన్ రాజ్

**చిక్కడపల్లి, జూలై 5 ప్రభాతవార్త:** అణగారిన నిరాశ్రయులైన అనాథలకు ఆహారం పెట్టండి పేరుతో ఏర్పాటు చేసిన స్వచ్ఛంద సేవ సంస్థ ఆధ్వర్యంలో ఇండియన్ క్రిస్టియన్ డే" సందర్భంగా నిరాశ్రయులైన పేదలకు ఉచిత అల్పాహారం పంపిణి చేసే కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. సామ్యూల్ కరణ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ యునైటెడ్ క్రిస్టియన్స్ అండ్ పాస్టర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గొనె సల్మాన్ రాజ్ హాజరై పంపిణి చేసారు. ఒక మంచి ఆశయంతో పేదలకు సేవ చేయాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టడం అభినందనీయమని అన్నారు.

## అర్హులైన వృద్ధ కళాకారులకు ఫించన్లు

### -రాష్ట్ర సాంస్కృతికశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు



కళాకారులతో మంత్రి జూపల్లి కృష్ణారావు, మాజీ ఎమ్మెల్యే మృత్యుంజయ

**రవీంద్రభారతి, జూలై 5 ప్రభాతవార్త :** భారతీయ, తెలంగాణ ప్రాచీన సంస్కృతి, సంప్రదాయాలకు, కళలకు కళారూపాలతో జీవంపోసి కాపాడుతూ భావితరాలకు అందిస్తున్న వృద్ధ కళాకారులను ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకుంటుందని, అలాగే కళాకారుల సమస్యలను పరిష్కరించేందుకు తనవంతు సంపూర్ణకృషి చేస్తానని రాష్ట్ర సాంస్కృతిక, పర్యాటకశాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు హామీనిచ్చారు. రవీంద్రభారతి ప్రాంగణం కళాభవన్‌లోని భాషా సాంస్కృతికశాఖ కార్యాలయం వద్ద మాజీ ఎమ్మెల్యే మృత్యుంజయ నేతృత్వంలో పలువురు కళాకారులు మంత్రిని కలిసి అర్హులైన వృద్ధకళాకారులకు పింఛన్ మంజూరు, ఆరోగ్యభీమా సదుపాయం కల్పించాలని, హెల్త్‌కార్డులు అందించాలని, గుర్తింపు కార్డులు ఇవ్వాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు. మంత్రి జూపల్లి అర్హులైన వృద్ధకళాకారులందరికీ పింఛన్ ఇచ్చే అంశాన్ని పరిశీలిస్తున్నామని, సీఎంతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని భరోసానిచ్చారు. తెలంగాణ సాధన ఉద్యమంలో కవులు, కళాకారుల పాత్ర ఎన్నటికీ మరచిపోమని, వారికి ప్రజాప్రభుత్వం అండదండగా ఉంటుందని స్పష్టం చేశారు.

### రైలు కిందపడి గుర్తుతెలియని యువకుడు మృతి

**హైదరాబాద్, జూలై5, ప్రభాతవార్త:** డెమో రైలు ఢీకొట్టడంతో గుర్తుతెలియని యువకుడు మృతిచెందిన ఘటన కాచిగూడ రైల్వేపోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వేసీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం విద్యానగర్, కాచిగూడ రైల్వేస్టేషన్ మార్గంలో శనివారం పట్టాలపై యువకుడు (25) మృత్యువాత పడినట్లు స్థానిక ప్రయాణికులు గమనించారు. వెంటనే రైల్వే పోలీసులకు సమాచారం అందించడంతో ఘటనస్థలికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. తెలుపురంగు చొక్కా, నీలిరంగు జీన్స్ ధరించాడని పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

## జగన్నాథ్ స్వామికి ఎమ్మెల్యే పూజలు



**అత్తాపూర్ జూలై 5, ప్రభాతవార్త :** శ్రీ పూరి జగన్నాథ్ రథయాత్రను పురస్కరించుకొని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ హౌసింగ్ బోర్డ్ కాలనీలోని నిర్వహించిన జగన్నాథ్ స్వామి ప్రత్యేక పూజల కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ హాజరై స్వామివారికి పూజలు చేశారు. కార్యక్రమంలో డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

### సున్నంచెరువులో ప్రమాదకరంగా చిన్నారుల ఈత



సున్నం చెరువులో ప్రమాదకరంగా ఉన్న ఈత కొడుతున్న చిన్నారులు

**యూసుఫ్‌గూడ, జూలై 5, ప్రభాతవార్త :**

అల్లాపూర్ డివిజన్ పరిధిలోని సున్నం చెరువులో హైడ్రా యంత్రాల ద్వారా సుందరీకరణ పనులను చేపడుతున్నారు. చెరువు పరిసరాలలో హైడ్రా పనులు జరుగుతున్నప్పటికి అక్కడి చిన్నారులు చెరువులో దిగి ప్రమాదకరంగా ఈత కొడుతున్నారు. చెరువులో పనిచేస్తున్న యంత్రాల వల్ల ఎపుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియదు అయినా చిన్నారులు నిర్లక్ష్యంగా ఈత కొడుతూ కనిపిస్తున్నారు. ఒకవేళ ప్రమాదం జరిగితే దీనికి బాధ్యత ఎవరిది అనే ప్రశ్న స్థానికులు ప్రశ్నిస్తున్నారు. అక్కడ సెక్యూరిటీ ఉండి కూడా ఈతను అడ్డుకోవడంలో విఫలం అవుతున్నారు. ప్రమాదం జరగకముందే ఈ విషయంపై అధికారులు తక్షణమే చర్యలు తీసుకుని చెరువు వద్ద సరియైన భద్రత ఏర్పాట్లు పెన్సింగ్ ఏర్పాటు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## 'మహాటీవీ' దాడి ఘటనలో జూబ్లీహిల్స్‌పోలీసులకు షోకాజ్ నోటీసు

**హైదరాబాద్, జూలై5, ప్రభాతవార్త:** మహాటీవీ న్యూస్ ఛానెల్ దాడి ఘటనలో నిందితుడిపై పోలీసులు దురుసుగా ప్రవర్తించారని జూబ్లీహిల్స్ పోలీసులకు శనివారం కోర్టు షోకాజ్ నోటీస్ జారీ చేసింది. దాడికి పాల్పడిన కేసులు అరెస్ట్ అయిన నిందితుడు కొల్లిసాయి నాగేశ్వర్‌రావుపై పోలీసులు దురుసుగా ప్రవర్తించడమే కాకుండా అసభ్యపదజాలంతో దూషించి చిత్రహింసలకు గురిచేశారని బీఆర్ఎస్ లీగల్‌సెల్ న్యాయవాది జక్కుల లక్ష్మణ్ కోర్టులో పిల్ దాఖలు చేశారు. ఇరుపక్షాల వాదనలు విన్న కోర్టు జూబ్లీహిల్స్ విచారాణాధికారికి షోకాజ్ నోటీసు జారీ చేసింది. అయితే ఈ పోలీస్‌స్టేషన్‌లో ఇన్విస్టిగేషన్ అధికారికి కోర్టు నోటీసులు ఇవ్వడం రెండోసారి కావడం చర్చానీయాంశంగా మారింది.

# గాడియంలో జాతీయ స్థాయి జిమ్నాస్టిక్స్ పోటీలు

**15 రాష్ట్రాల నుంచి పాల్గొన్న 850 మంది జిమ్నాస్ట్‌లు**

**హైదరాబాద్, జూలై 5,ప్రభాతవార్త:**

యువతలో క్రీడాస్ఫూర్తిని, జాతీయ సమైక్యతను పెంపొందించాలనే లక్ష్యంతో హైదరాబాద్‌కు చెందిన ది గాడియం స్కూల్ జిమ్క్విన్ రెండో ఎడిషన్‌ను శనివారం ప్రారంభించింది. రెండు రోజుల పాటు జరిగే ఈ జాతీయ స్థాయి జిమ్నాస్టిక్స్ ఈవెంట్‌లో దేశంలోని 15 రాష్ట్రాల నుంచి 850 మంది యువ జిమ్నాస్ట్‌లు పాల్గొంటున్నారు. వీరిలో గాడియం స్కూల్ నుంచి 107 మంది విద్యార్థులు తమ ప్రతిభను చాటుతున్నారు. దేశంలోనే మొదటి సారిగా జిమ్నాస్టిక్స్ పోటీలను జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్న తొలి స్కూల్‌గా ది గాడియం చరిత్ర సృష్టించింది. ప్రముఖ బ్యాడ్మింటన్ కోచ్ పుల్లెల గోపీచంద్ ఈ ఈవెంట్‌ను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈయన మాట్లాడుతూ పాఠశాల స్థాయి జిమ్నాస్ట్‌లకు ఇలాంటి జాతీయ వేదికను అందించడం ప్రశంసనీయమన్నారు. ది గాడియం స్కూల్ విద్యతో పాటు దేశ క్రీడా భవిష్యత్తుకు కూడా తోడ్పడుతోంద్ని అని కొనియాడారు. స్కూల్ వ్యవస్థాపకురాలు, డైరెక్టర్ కె. కీర్తి రెడ్డి మాట్లాడుతూ, ఇది కేవలం పోటీ కాదని, దేశ వ్యాప్తంగా ఉన్న విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించడానికి ఒక వేదిక అన్నారు. వ్యక్తిగత, టీమ్ పోటీల్లో రిథమిక్ జిమ్నాస్టిక్స్, డ్యాన్స్ జిమ్నాస్టిక్స్, ఆర్టిస్టిక్ జిమ్నాస్టిక్స్, ఫ్లోర్ రొటీన్స్ గ్రూప్ అక్రోబాటిక్స్ వంటి ఈవెంట్లలో జిమ్నాస్ట్‌లు పోటీపడ్డారు. ఈ కార్యక్రమానికి భారత సైన్యానికి చెందిన కల్నల్ కమలేష్ మిశ్రా, పోలీ సు సూపరింటెండెంట్ (ఇంటెలిజెన్స్) శిరీష రాఘవేంద్ర వంటి ప్రముఖులు హాజరై జిమ్నాస్ట్‌లను అభినందించారు.



పోటీల్లో జిమ్నాస్ట్‌ల ప్రదర్శన

## నాచారంలో ఘనంగా వనమహోత్సవ వేడుక

**నాచారం, జూలై 5 ప్రభాతవార్త :** పర్యావరణ సమతుల్యతను కాపాడుకోవడంలో చెట్ల పాత్రపై విద్యార్థులకు శనివారం అవగాహణ నిర్వహించారు. నాచారంలోని డెక్కన్ స్ప్రింగ్స్ గ్లోబల్ స్కూల్ లో జాతీయ వనమహోత్సవాన్ని పురస్కరించుకుని పాఠశాల ఆవరణమంతా ఆకుపచ్చ రంగుతో విలసిల్లింది. పిల్లలు, ఉపాధ్యాయులు ఆకుపచ్చ వస్త్రధారణతో ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలతో కూడిన సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ కె. నవనీతరావు, మేనేజింగ్ డైరెక్టర్ కె. నవీన్ కుమార్, కోర్ హెడ్ ఆపరేషన్స్ కిషోర్ కుమార్ రెడ్డి, ప్రిన్సిపాల్ స్వర్ణ అక్కినేని, వైస్ ప్రిన్సిపాల్స్ పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ నవనీతరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి మనకు జీవనాధారమనీ, దీనివల్ల మన భవిష్యత్తు పురోభివృద్ధి చెందుతామని అన్నారు. స్వర్ణ అక్కినేని మాట్లాడుతూ మన పర్యావరణం మన ఆరోగ్యానికి మార్గం వేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు నృత్య, గాన, నాటకాలతో పర్యావరణ పరిరక్షణా సందేశాన్ని అందించారు. విద్యార్థులు పర్యావరణ సంరక్షణ కోసం చెట్లను కాపాడాలని రాఘవేంద నగర్ పరిసరాల్లో ర్యాలీని నిర్వహించారు.



పర్యావరణ పరిరక్షణపై అవగాహణ ర్యాలీలో పాల్గన్న చిన్నారులు

## రాయిపల్లి విద్యార్థులు ట్రిబుల్ ఐటికి ఎంపిక

**మనూర్, జూలై 5, ప్రభాతవార్త:**

మండల పరిధిలోని రాయిపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యను అభ్యసించిన ముగ్గురు విద్యార్థులు బాసర ట్రిబుల్ ఐటికి ఎంపికయినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజుప్రసన్న పేర్కొన్నారు. ట్రిబుల్ ఐటికి ఎంపికైన విద్యార్థినులు శివాని, హస్మిత, నందినిలను ప్రధానోపాధ్యాయులు రాజుప్రసన్న, ఉపాధ్యాయులు రవికుమార్, శ్రీకాంత్, ఈశ్వర్రావు, శ్రీనివాస్, మధుకర్‌రెడ్డి, నాగలక్ష్మి, పద్మశ్రీ, చాముండేశ్వరి, పద్మజలు ప్రత్యేకంగా అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

## బిఆర్ఎస్‌పాలనలో అభివృద్ధి శూన్యం..

**-ఎమ్మెల్యే రోహిత్‌రావుపై విమర్శలు చేస్తే ఊరుకునే ప్రసక్తే లేదు**
**-కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు చౌదరి సుప్రభాతరావు**

**రామాయంపేట, జూలై 5, ప్రభాతవార్త:**

నియోజకవర్గాన్ని ఎన్నేసి, 12సంవత్సరాలుగా రామాయంపేట అభివృద్ధికి నోచుకోకుండా చేసిన మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావుపై విమర్శలుచేస్తే ఊరుకునేదిలేదని కాంగ్రెస్ పార్టీ సీనియర్‌నాయకులు చౌదరి సుప్రభాతరావు హెచ్చరించారు. రామాయంపేట మండల కేంద్రంలో శనివారం కాంగ్రెస్ పార్టీ నాయకులు మీడియా సమావేశం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి తాము కేటాయించిన పనులకే కొబ్బరికాయలు కొడుతున్నారంటూ ఎమ్మెల్యే రోహిత్‌రావుపై చేసిన వ్యాఖ్యలను చౌదరి సుప్రభాతరావు తీవ్రంగా ఖండించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే గతంలో ఉన్న పనులు, కార్పొరేషన్ పదవులను తొలగించామని, తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మెదక్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే రోహిత్‌రావు సహకారంతో అభివృద్ధినిధులు తీసుకువచ్చి టెండర్లు పిలవడం జరిగిందని తెలిపారు. రామాయంపేట మున్సిపాలిటీ ఇప్పటికే 18కోట్ల రూపాయల నిధులు కేటాయించగా, 40కోట్లరూపాయలు కేటాయించి రామాయంపేటను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నిధులు కేటాయించడమే కాదు పనులు కూడా చేస్తున్నామని తెలిపారు. ఎక్కడా లేనివిధంగా రామాయంపేటకు 220 కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణం చేస్తున్నామని తెలిపారు. రాబోవు రోజుల్లో అందరి సహకారంతో రామాయంపేట నియోజకవర్గాన్ని తీసుకువస్తామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ కౌన్సిలర్లు దేమే యాదగిరి, చిలుక గంగాధర్, కాంగ్రెస్‌పార్టీ నాయకులు రమేష్‌రెడ్డి, అల్లాడి వెంకటి, పిట్ల ప్రకాష్, సుంకోజు దామోదర్, దేవుని రాజు, పోచమ్మల గణేష్, రెడ్డి నరేష్, చిలుక వెంకటి, బొట్ల బాబు, చింతల స్వామి, దాశిస్వామి, బైరం కుమార్, పోచమ్మల ఆశ్విని శ్రీనివాస్, గౌరివర్ల యాదగిరి పాల్గొన్నారు.

## సహకార సంస్థలు మెరుగైన ప్రపంచాన్ని నిర్మిస్తున్నాయి

**-పిఎసిఎస్ చైర్మన్ బట్టు అంజిరెడ్డి**



సహకార జెండాను ఆవిష్కరిస్తున్న పిఎసిఎస్ చైర్మన్ బట్టు అంజిరెడ్డి

**ములుగు, జూలై 5, ప్రభాతవార్త:**

సభ్యులను ఆర్థికంగా బలోపేతంచేసి మెరుగైన ప్రపంచాన్ని నిర్మించేందుకు సహకార సంస్థలు కృషి చేస్తున్నాయని పిఎసిఎస్ చైర్మన్ బట్టు అంజిరెడ్డి అన్నారు. శనివారం అంతర్జాతీయ సహకార దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలకేంద్రం ములుగులోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ బట్టు అంజిరెడ్డి చేతుల మీదుగా సహకార జెండాను ఆవిష్కరించి సహకార గేయాన్ని ఆలపించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా స్థిరత్వం, సమాన, స్థిరమైన ప్రపంచాన్ని నిర్మించటంలో సహకారసంస్థలు కీలకపాత్ర పోషిస్తున్నాయన్నారు. సభ్యుల అవసరాలకు అనుగుణంగా ఆతిథ్యాన్ని వడ్డీలేని రుణాలను అందిస్తూ సమాజంలో ఆర్థిక అసమానతలు తొలగించడంలో సహకార సంస్థలు క్రియాశీలక భూమికను పోషిస్తున్నాయన్నారు. కార్యక్రమంలో పిఎసిఎస్ వైస్ చైర్మన్ కుక్కల నరేందర్, సీఈవో రమేష్‌బాబు, డైరెక్టర్లు రమేష్, రాములుగౌడ్, సత్తయ్య, భంగ్యా, సిబ్బంది స్వరూప, దీక్షిత, సభ్యులు పాల్గొన్నారు.

## హెటెరో పరిశ్రమలో టిఆర్‌టియుసి యూనియన్ గెలుపు

**-ఐఎన్‌టియుసిపై 119 ఓట్లతో గెలిచిన టిఆర్‌టియుసి**



హెటెరో పరిశ్రమలో టి.ఆర్.టి.యు.సి యూనియన్ గెలుపు

**జిన్నారం, జూలై 5, ప్రభాతవార్త:**

జిన్నారం మండలం బొల్లారం మున్సిపాలిటీ లోని హెటెరో పరిశ్రమ గుర్తింపు యూనియన్ ఎన్నికల్లో ఐఎన్‌టియుసిపై టిఆర్‌టియుసి 119ఓట్ల మెజార్టీతో విజయాన్ని సాధించింది. శనివారం పరిశ్రమయూనియన్ ఎన్నికల్లో టిఆర్‌టియుసికిచెందిన నాయకులు వి.వరప్రసాద్‌రెడ్డి ప్రత్యర్థి ఐఎన్‌టియుసి అభ్యర్థి నరసింహారెడ్డిపై 119ఓట్లతో విజయం సాధించారు. ఎన్నికల్లో వి.వరప్రసాద్‌రెడ్డికి 337ఓట్లురాగా, నరసింహారెడ్డికి 218, బిఎంఎస్‌కి 60 ఓట్లు వచ్చాయి. వి.వరప్రసాద్‌రెడ్డి విజయంతో కార్మికులు విజయోత్సవ సంబరాలు జరుపుకొని ర్యాలీ నిర్వహించారు. అనంతరం వి.వరప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ కార్మికుల సంక్షేమం కోసమే టిఆర్‌టియుసి అహర్నిశలు పనిచేస్తుందని తనవిజయం కార్మికులకు అంకితమన్నారు. కార్యక్రమంలో హెటెరో కంపెనీ ప్రెసిడెంట్ మాజీ ఎమ్మెల్యే రాములునాయక్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు, మాజీ కౌన్సిలర్ వి.చంద్రారెడ్డి, మాజీ కౌన్సిలర్లు, నాయకులు దిననాథ్, శ్రీమన్నారాయణ, రాజారామ్, జనరల్ సెక్రటరీ లక్కన్‌సింగ్, కార్మికనాయకులు ఉద్యానంద్, ధర్మేందర్‌యాదవ్, ఉమాకాంత్‌యాదవ్, తీవారీ తదితరులు పాల్గొన్నారు.

## విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

**-నర్సాపూర్ సిడిపిఓ హేమ భార్గవి**

**నర్సాపూర్ రూరల్, జూలై 5, ప్రభాతవార్త:**

విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని నర్సాపూర్ సిడిపిఓ హేమ భార్గవి హెచ్చరించారు. నర్సాపూర్ మండలంలోని నారాయణపూర్ సెక్టార్ పరిధిలోని అంగన్వాడీ కేంద్రాలలో 5సంవత్సరాల పిల్లలకు ప్రత్యేక బరువుల పరిశీలించారు. నారాయణపూర్ సెక్టార్ పరిధిలోని అంగన్వాడీ కేంద్రాలలో పిల్లల యొక్క బరువులు ఏవిధంగా ఉన్నాయో వాళ్లు ఏ స్థితిలో ఉన్నారో తెలుసుకోవడానికి ప్రత్యేకంగా సందర్శన కార్యక్రమం నిర్వహించినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా నర్సాపూర్ ప్రాజెక్టు పరిధిలోని సూపర్వైజర్లందరికి కార్యక్రమం నిర్వహించగా సిడిపిఓ హేమ భార్గవి స్వయంగా రుస్తుంపేట్ మూసాపేట్ నాగులపల్లి.... కేంద్రాలను సందర్శించి అక్కడ ఉన్న పిల్లల బరువులను స్వయంగా తీసి గమనించారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు పాల్గొనడం జరిగింది.

## ట్రిపుల్ ఐటికి టేక్మాల్ విద్యార్థుల ఎంపిక

**టేక్మాల్, జూలై 5, ప్రభాత వార్త:**

టేక్మాల్ మోడల్ (ఆదర్శ)స్కూల్ లో పదో తరగతి పూర్తి చేసి బాసర ట్రిబుల్ ఐటికి టేక్మాల్ ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారు. టేక్మల్ మోడల్ స్కూల్లో టెక్మాల్ గ్రామానికి చెందిన సంజన, గొల్లగూడెంకు చెందిన శ్వేత పదో తరగతిలో టాపర్‌గా నిలిచి ట్రిబుల్ ఐటికి ఎంపికైయ్యారు. టేక్మాల్ ఆదర్శ పాఠశాల విద్యార్థులు ట్రిబుల్ ఐటికి ఎంపిక కావడం పట్ల మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ సాయిలు తెలిపారు. మండల పార్టీ బిఆర్ఎస్ శాఖ అధ్యక్షుడు వీరప్ప, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రమేష్, భాజపా మండల అధ్యక్షులు శంకర్‌లు హర్షం వ్యక్తం చేశారు.

# ఆర్టీసీ ఆదాయానికి గండికొడుతున్న అధికారుల నిర్లక్ష్యం..

**-తూతూ మంత్రంగా టెండర్లు...**
**-నాలుగేళ్లుగా కార్యరూపం దాల్చని పనులు...**
**-సుమారు కోటికి పైగా వచ్చే ఆదాయం హాంఫట్...**

**సదాశివపేట, జూలై 5, ప్రభాతవార్త:**

ఆర్టీసీ అధికారులకు జవాబుదారీతనం కొరవడింది. ఆదాయం మార్గాలు ఉన్నా మాకెందుకులే అని చేతులు దులుపుకుంటున్నారు. వివరాలలోకి వెళితే సంగారెడ్డి జిల్లా సదాశివపేటలో నాలుగు సంవత్సరాల క్రితం నూతనంగా బస్టాండ్ నిర్మించారు. ఒడిదుడుకుల మధ్య ఈ బస్టాండ్ నిర్మాణం పూర్తి కావడానికి నాలుగు సంవత్సరాలు పట్టింది. ఈ ప్రాంతం పారిశ్రామికంగా వ్యాపార పరంగా అభివృద్ధిచెందడంతో ఈ ప్రాంగణానికి కర్ణాటక మహారాష్ట్ర నుండి హైదరాబాద్‌కు వెళ్లే బస్సులు ఇక్కడ ఆగుతాయి. నిత్యం ప్రయాణికులతో రద్దీగా ఉండే ఈప్రయాణప్రాంగణంలో స్టాల్స్‌ను అద్దెకు ఇవ్వడం వలన మంచి ఆదాయం వస్తుంది. ఇదికాక ఇంకా ప్రతినెల లక్షకుపైగా ఆదాయం సమకూర్చే ఖాళీస్థలం ఉన్నప్పటికీ దానిని ఉపయోగంలోకి తీసుకురాక పోవడంతో నాలుగు సంవత్సరాలుగా ఆ స్థలం అలాగే ఉంది. గతంలో ఉన్న టూ వీలర్ పార్కింగ్ స్థలాన్ని సగానికి కుదించి అద్దె తగ్గించినప్పటికీ ఆ స్థలాన్ని పూర్తిగా వాడుకోవడంతో ఆర్టీసీకి వచ్చే మిగతా ఆదాయం పోతుంది. ఖాళీస్థలం వినియోగంలో లేకపోవడంతో అక్కడ చెత్తకుప్పలు ముళ్ళపొదలు పశువుల సంతలా తయారైంది స్థలం ఖాళీగా ఉండటం వలన బయటి వాహనాలు అక్కడ పార్కింగ్ చేస్తున్నారు. ఎప్పుడు ఆర్టీసీనష్టాలు అనే ఊతపదాన్ని మాని లాభాలు తేవడానికి కృషిచేయాలని ప్రజలు కోరుతున్నారు.



బస్టాండ్ ఆవరణలో కేటాయించిన సగం స్థలంలో పార్కింగ్

# ఆరుతడి పంటలు వేసుకోవాలి..

**-ఇంచార్జి సహాయ వ్యవసాయ సంచాలకులు రాజ్‌నారాయణ**



కంది పంట వేసే విధాన్ని పరిశీలిస్తున్న రాజ్‌నారాయణ

**రామాయంపేటమున్సిపాలిటీ, జూలై 5, ప్రభాతవార్త:**

రామయంపేట మండలం, గ్రామంలో కంది పంట వేసే విధానాన్ని శనివారం ఇన్చార్జి సహాయ వ్యవసాయ సంచాలకులు రాజ్ నారాయణ పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వరి పంట తర్వాత మళ్లీ వరి పంట వేయడం ద్వారా కాండం తొలుచు పురుగు, అగ్గి తెగులు, బ్యాక్టీరియా, ఎండు తెగులు మరియు ఉల్లికోడు వంటి తెగుళ్ల మరియు పురుగులు సోకి వరి పంట దిగుబడి పై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది అదేవిధంగా వీటిని నివారించడానికి పురుగు మందుల్ని తెగులు మందుల్ని ఎక్కువసార్లు పిచికారి చేయడం వల్ల వాతావరణ కాలుష్యము అదేవిధంగా నీటి కాలుష్యము నేల కాలుష్యము తో పాటుగా పిచికారి చేసే రైతుల ఆరోగ్యంపై తీవ్ర దుష్ప్రభావం ఉన్న నేపథ్యంలో వ్యవసాయ శాఖ ద్వారా వరికి ప్రత్యామ్నయంగా ఆరుతడి పంటలు అయినటువంటి పప్పు జాతి పంటల సాగును ప్రోత్సహించడం జరుగుతుంది అన్నారు. ఇందులో భాగంగా జాతీయ ఆహార భద్రతా పథకం కింద కంది విత్తనాలను అందజేసి ఆ రైతుల క్షేత్రంలో వేసేటువంటి విధానాన్ని స్వయంగా పరిశీలించడం జరిగిందని తెలిపాఉ. అదేవిధంగా విత్తనం దశ నుంచి పంటకోత వరకు వివిధ దశల్లో రైతుల క్షేత్రాలను సందర్శిస్తూ కంది పంటలో సాగులో చీడపీడల నివారణ పద్ధతుల గూర్చి రైతులకు అవగాహన కల్పించడం జరుగుతుందని, ఆరుతడి పంటల సాగు వల్ల రైతులకు తక్కువ పంట కాలంలో మంచి దిగుబడి వచ్చే అవకాశం ఉంటుందని సూచించారు. పంట మార్పిడి వల్ల చీడపీడల ప్రభావం తక్కువగా ఉంటుందని, పంట మార్పిడి వల్ల నేలలో పంటకు మేలుచేసే సూక్ష్మ జీవులు, వానపాములు వృద్ధిచెంది పంటలు దిగుబడిలో కీలక పాత్ర పోషిస్తుందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తీర్ణ అధికారి ప్రవీణ్‌తోపాటుగా రైతులు పాల్గొన్నారు.

# ఘనంగా ఆషాఢ త్రిరాత్రోత్సవాలు

**-అనుగ్రహ భాషణం చేసిన పుష్పగిరి పీఠాధిపతి విద్యాశంకరభారతి స్వామి**

**మర్కుక్, జూలై 5, ప్రభాతవార్త:**

మండల పరిధిలోని పాండురంగ ఆశ్రమంలో 94వఆషాఢత్రిరాత్రోత్సవాలు శనివారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. స్వస్తి పుణ్యాహవచనంతో క్రతువు మొదలైంది. పుష్పగిరి పీఠాధిపతి విద్యాశంకరభారతి స్వామివారు విశిష్ట అతిథిగా విచ్చేసి అనుగ్రహ భాషణం చేసి అందరిని ఆశీర్వదించారు. అనంతరం త్రిరాత్రోత్సవాల్లో భాగంగా అఖండ భగవన్నామ క్రతువు సంప్రదాయబద్ధంగా ప్రారంభమైంది. హార్మోనియం తాళాలు, తబలాలు చేతబూని తన్మయత్వంతో భక్తులు మైమరచి పాండురంగని భజనలో మమేకమయ్యారు. మరోవైపు స్వామివారికి గోక్షీరాభిషేకంతో విశేష అభిషేకం, లక్ష పుష్పార్చన, పురుషసూక్త అర్చన వైభవోపేతంగా జరిగాయి. తొలి ఏకాదశి అయిన ఆదివారం నిరంతరం స్వామి దర్శనం అందుబాటులో ఉంటుందని, భక్తులకు జల్లు స్నానం, ఉపహారం, తేనీరు సేవలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు.



విద్యాశంకరభారతి స్వామికి పూర్ణకుంభంతో స్వాగతం పలుకుతున్న అర్చకులు

### భోజనం కంటే భజన గొప్పది...

**-విద్యాశంకరభారతి స్వామి**

భోజనం కంటే భజన గొప్పదని, ప్రతి ఒక్కరూ తప్పకుండా రోజూ సాయంత్రం భగవన్నామస్మరణ చేయాలని, భగవంతుని అనుగ్రహం పొందాలని సూచించారు. ఓవైపునాదం మరోవైపుసాధం (అన్నదానం)తో నిరంతరం అలరారే పాండురంగ ఆశ్రమం అంటే తనకు ఎంతో ఇష్టమని, అందుకే తరచూ వస్తుంటానని చెప్పారు. తొలి ఏకాదశి పర్వదినాన ప్రతి ఒక్కరూ నిరంతరం భగవన్నామ స్మరణ చేసి తరించాలని వెల్లడించారు. ప్రతి 15 రోజులకు వచ్చే ఏకాదశి రోజు ఉపవాసం ఉంటే ఎంతో పుణ్యమని, కనీసం తొలి ఏకాదశి రోజైనా ఉపవాస దీక్ష చేస్తే సంవత్సరం మొత్తం ఉపవాసం చేసిన పుణ్యం లభిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# కుక్కల బెడద నివారించాలని వినతి...

**-అధికారులు లేక మున్సిపాలిటీ కుర్చీకి ఫిర్యాదు...**
**-పట్టించుకోకపోతే 300 మందితో మున్సిపాలిటీ ముట్టడిస్తాం**
**-దుర్గమ్మ బస్తీ వాసుల హెచ్చరిక**



కుర్చీకి వినతిని అందిస్తున్న దృశ్యం

**రామాయంపేట మున్సిపాలిటీ, జూలై 5, ప్రభాతవార్త:**

కుక్కల బెడదతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, రామయంపేట మున్సిపాలిటీ పరిధిలోని తొమ్మిదో వార్డు, దుర్గమ్మ బస్తీవాసులు శనివారం మున్సిపాలిటీలో తమబాధను వెళ్లబోసుకున్నారు. ఈ సందర్భంగా బసన్నపల్లి మల్లేశం మాట్లాడుతూ దుర్గమ్మబస్తీలో కుక్కలు, కోతులతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. బస్తీలో బసన్నపల్లి లక్ష్మీ అనే ఓ మహిళాపై నెలరోజుల్లో రెండుసార్లు దాడిచేసి, కరిచాయని తెలిపారు. వీధుల్లో కుక్కలు విచ్చలవిడిగా తిరుగుతుండడంతో, పిల్లల్ని బయటికి పంపే పరిస్థితి లేకుండా పోయిందన్నారు. స్కూలుకి వెళ్లిన పిల్లలకు, ఇంటికివచ్చే సమయంలో ఎక్కడైనా చిన్నకాటు వేస్తే, పిల్లలు ఇంట్లో చెప్పకపోతే, ప్రాణాలు పోయే పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉంటుందన్నారు. మున్సిపల్ అధికారుల దృష్టికి ఎన్నిసార్లు తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదన్నారు. మున్సిపాలిటీ సమావేశానికి వచ్చిన ఆర్డిఓ అధికారి దృష్టికి తీసుకుపోయినా, పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. ఇప్పటికైనా రామయంపేట పట్టణంలో, దుర్గమ్మ బస్తీలో కుక్కలు, కోతుల బెడద నివారణకు చర్యలు తీసుకోకపోతే, 300మందితో మున్సిపాలిటీ ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బస్తీవాసులు పోచమ్మల పోచయ్య, పుట్టి శ్రీనివాస్, ఎర్రగొల్ల మహేష్, పోచమ్మల మహేష్, ఎర్రగొళ్ల ప్రశాంత్ పుట్టి సందీప్, డీజే రాజుతో పాటు పలువురు ఉన్నారు.

**అధికారులు లేక ఖాళీ కుర్చీకి ఫిర్యాదు...**

కుక్కల బెడద నివారించాలని ఫిర్యాదు చేయడం కోసం మున్సిపాలిటీకి వెళ్లిన దుర్గమ్మ బస్తీ వాసులకు, అక్కడ ఖాళీ కుర్చీలే దర్శనమిచ్చాయి. సమయం ఉదయం 11గంటలు దాటిన, మున్సిపాలిటీ కమిషనర్ గాని, మేనేజర్ గానీ అందుబాటులో లేరు. దీంతో కాళీ కుర్చికి తమ ఫిర్యాదును అందజేశారు. ఇప్పటికే రామయంపేట పట్టణంలో అపరిశుభ్రత వల్ల దోమల బెడద పెరిగిందని, గొల్లిపర్తి లో మూడు డెంగ్యూ కేసులు నమోదైన అధికారులకు చీమకుట్టినట్టైనా లేదని విమర్శలు వెలువెత్తుతున్నాయి.

## నర్సారెడ్డిని విమర్శించే నైతికహక్కు బిజెపికి లేదు

**-గజ్వేల్ ఎఎంసి వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్**




విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సర్దార్‌ఖాన్

**గజ్వేల్ టౌన్, జూలై 5, ప్రభాతవార్త:**

ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజల్లో మంచి గుర్తింపు తెచ్చుకున్న గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తూంకుంట నర్సారెడ్డిని విమర్శించే నైతిక హక్కు బిజెపి నాయకులకు లేదని గజ్వేల్ వ్యవసాయ మార్కెట్‌కమిటీ వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్ అన్నారు. శనివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్న నర్సారెడ్డి ఏ అర్హతతో అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటున్నారని, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి కొబ్బరికాయలు కొడుతున్నారని మాట్లాడుతున్న బిజెపి నాయకుల మాటలు అర్థరహితమని అన్నారు. బిజెపినేత ఎంపిగా ఉండి గజ్వేల్‌కు ఏమిచేశారో చెప్పాలని డిమాండ్‌చేశారు. నర్సారెడ్డిపై విమర్శలు చేస్తే ఊరుకునేదిలేదని హెచ్చరించారు.

## అంబేద్కర్ సంఘం నూతన కమిటీ

**మిరుదొడ్డి, జూలై 5, ప్రభాతవార్త:**

మిరుదొడ్డి మండల కేంద్రంలోని అంబేద్కర్ సంఘం(మాల) నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా అస్క స్వామి, ఉపాధ్యక్షులుగా మద్దెల నరేష్, నక్క సాయి, ప్రధాన కార్యదర్శిగా మద్దెల ప్రవీణ్, కార్యదర్శిగా ర్యాకం కిరణ్, దార కిషన్, సంయుక్త కార్యదర్శిగా పోడ్డేటి నరసింహులు, మద్దెల పరశురాములు, ర్యాకం అనిల్, కోశాధికారిగా పోడ్డేటి మహేందర్, సాంస్కృతిక కార్యదర్శిగా నర్మల అంజి, సలహాదారులుగా మద్దెల సుదర్శన్, నర్మల చంద్రం, నక్క రాజం, మద్దెల మల్లేశం, పోడ్డేటి మల్లయ్య, మద్దెల చంద్రం, మద్దెల శేఖర్, నక్క రాములు, దారా బాబు, ర్యాకం బాలమల్లు, ర్యాకం బాబు, మద్దెల పాపయ్య, మద్దెల లక్ష్మయ్య తదితరులను అంబేద్కర్ సంఘం సభ్యులుగా ఎన్నుకున్నారు.

## సేవారత్న అవార్డ్‌కు ఎంపికైన శివ

**చిన్నశంకరంపేట, జూలై 5, ప్రభాతవార్త:**

సానీక్ష ఫౌండేషన్ అధ్యక్షుడు ధరావత్ శివనాయక్ మరో అవార్డుకు ఎంపికయ్యారు. డైమండ్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు సమాజ్ సేవారత్న అవార్డు-2025కు ఎంపికైనట్లు శివ తెలిపారు. గత 12 సంవత్సరాల నుండి చేస్తున్న సేవాకార్యక్రమాలను గుర్తించి డిల్లికిచెందిన పబ్లిక్ వెల్ఫేర్ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు రాజేష్‌నాథ్ తెలిపినట్లు శివ తెలిపారు. ఈ అవార్డును ఉత్తరప్రదేశ్ లేదా ఢిల్లీలో ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ అవార్డు రావడంపట్ల శివ సంతోషం వ్యక్తంచేశారు.

## పేట తహసీల్దార్‌గా మాలతి

**చిన్నశంకరంపేట, జూలై 5, ప్రభాతవార్త:**

చిన్నశంకరంపేట నూతన తహసీల్దార్‌గా మాలతి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకుముందు ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేసిన అబ్దుల్ మన్నన్ ఇటీవల పదవీవిరమణ చేశారు. కాగా మాలతి నిజామాబాద్ జిల్లా ధర్పల్లి మండల తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తూ బదిలీపై చిన్నశంకరంపేటకు వచ్చారు. ఈ సందర్భంగా నూతన తహసీల్దార్ మాలతి మాట్లాడుతూ ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ భూభారతి, రెవెన్యూపరమైన సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు.

## నిరుపేదలకు ఆపన్న హస్తం సిఎంఆర్‌ఎఫ్

**-రూ.22 లక్షల విలువైన చెక్కుల పంపిణీ**
**-పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి**

**పటాన్‌చెరు, జూలై 5, ప్రభాతవార్త:**

నిరుపేదలకు మెరుగైనవైద్యం అందించడంలో ముఖ్యమంత్రి సహాయ నిధి ఆపన్న హస్తంగా నిలుస్తోందని పటాన్‌చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. శనివారం పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో నియోజకవర్గ పరిధిలోని వివిధ గ్రామాలు, డివిజన్లకు సంబంధించిన 48మంది లబ్దిదారులకు మంజూరైన 22లక్షల 10వేల రూపాయల విలువైన చెక్కులను స్థానికనాయకులతోకలిసి ఆయన పంపిణీచేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల సంక్షేమం, ఆర్థిక అభివృద్ధి లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పనిచేస్తుందని తెలిపారు. పూర్తి పారదర్శకతతో అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ ఛైర్మన్ ప్రభాకర్, డిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ శ్యామ్‌రావు, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు నరసింహారెడ్డి, సీనియర్‌నాయకులు ప్రమోద్‌గౌడ్, వెంకటేష్, ఆంజనేయులు, జనార్ధన్, శివరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే ఉల్లాస్ మరియు టాస్

**నర్సాపూర్ రూరల్, జూలై 5, ప్రభాతవార్త:**

నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తిర్చిదిద్దడమే ఉల్లాస్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు స్టేట్ కోఆర్డినేటర్లు ఆర్ జ్యోతి, శంకర్ మెదక్ జిల్లా వయోజన విద్యాధికారి మురళిలు అన్నారు. శనివారం నర్సాపూర్ మండలం బ్రాహ్మణపల్లి గ్రామంలో ఉల్లాస్ మరియు టాస్ అనే కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా తెలంగాణ ప్రభుత్వం నిరక్షరాస్యత నిర్మూలన దిశగా చేపట్టిన కార్యక్రమంలో మహిళా సంఘాలలో ఉన్న పూర్తి నిరక్షరాశ్యుల కోసం ఉల్లాస్ అనే జాతీయ స్థాయి కార్యక్రమం ద్వారా ప్రతి పదిమందికి ఒక వాలంటీర్ టీచర్ ద్వారా నిరంతర విద్యాసాధన చేపట్టి తద్వారా అక్షరాస్యులుగా మార్చే కార్యక్రమం, బడి మధ్యలో మానేసిన వయోజనులకి టాస్ తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ద్వారా పదవ తరగతి మరియు ఇంటర్మీడియట్ విద్యను అందించి పరీక్షకి హాజరు అయ్యేలా వారిని విద్యావంతులుగా తీర్చడం దీని యొక్క ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ఈ కార్యక్రమం ఉద్దేశించి జిల్లా వయోజన విద్యాధికారి మురళి మాట్లాడుతూ గ్రామ సంఘంలోని మహిళలందరూ ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం కావాలని కోరారు. జరిగింది. ఈ కార్యక్రమంలో ఏపిఎం గౌరీ శంకర్, సిసి భాగ్య, గ్రామ పూర్వ సాక్షర భారత్ కోఆర్డినేటర్ సుదీర్ గౌడ్, సిఏ శైలజ గ్రామ సంఘం లీడర్లు లక్ష్మి, లావణ్య, 50 మంది మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

## ఘనంగా అంతర్జాతీయ సహకార దినోత్సవం

**శివ్వంపేట, జూలై 5, ప్రభాతవార్త:**

మండల కేంద్రమైన శివ్వంపేటలోని పిఎసిఎస్ కార్యాలయం వద్ద అంతర్జాతీయ సహకార దినోత్సవం పురస్కరించుకొని కార్యాలయం వద్ద జెండాను ఎగరవేసి అంతర్జాతీయ సహకార దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. అంతర్జాతీయ సహకార దినోత్సవానికి నర్సాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆవుల రాజిరెడ్డి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు పులిమామిడి నవీన్ గుప్తా, ఎస్పై మధుకర్ రెడ్డి, పిఎసిఎస్ వైస్ చైర్మన్ వేణుగోపాల్‌రెడ్డి, కమలాపూర్ సింగ్, మాజీ ఉపసర్పంచ్ కాముని శ్రీనివాస్, నాయకులు వారాల గణేష్, దావూద్, ప్రభు లింగం గౌడ్, యువ నాయకులు ఇసుగారి అరుణ్, సోను, తిరుపతి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## బాసర ట్రిబుల్ ఐటికి మిర్జాపూర్ విద్యార్థులు

**న్యాల్‌కల్, జూలై 5, ప్రభాతవార్త:**

మండలపరిధిలోని మిర్జాపూర్ (బి) గ్రామంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 10వతరగతి చదివి మంచి శ్రేణితో ఉత్తీర్ణులైన ఎం.నవీన్, ఎండి జునేద్‌లు బాసరట్రిబుల్‌ఐటికి ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.రాజ్‌కుమార్ తెలిపారు. ట్రిబుల్‌ఐటికి ఎంపికైన విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.రాజ్‌కుమార్ ప్రత్యేకంగా అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థులు ట్రిబుల్ ఐటికి ఎంపికయ్యేందుకు కృషిచేసిన పాఠశాల ఉపాధ్యాయులకు, అందుకు సహకరించి విద్యార్థుల పోషకులకు ప్రధానోపాధ్యాయులు రాజ్‌కుమార్, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ బిస్మిల్లా బేగంలు అభినందించారు.

## ఉత్సవాలకు ముస్తాబైన విఠలేశ్వర స్వామి ఆలయం



ఆలయంలో కొలువైన విఠలేశ్వరస్వామి

**పెద్దశంకరంపేట, జూలై 5, ప్రభాతవార్త:** ఆషాఢశుద్ధ తొలి ఏకాదశి ఈనెల 6నుంచి 10వ తేదీవరకు విఠలేశ్వర స్వామి ఆలయంలో ఆషాఢమాస ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు దేవస్థానం కమిటీ సభ్యులు తెలిపారు. ఈసందర్భంగా విఠలేశ్వర ఆలయాన్ని వివిధ రకాల పూలతో, విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. ఈనెల 6న తొలి ఏకాదశి సందర్భంగా రుక్మిణీవిఠలేశ్వరస్వామికి అభిషేకాలు, పల్లకీ సేవ జరుపనున్నామని ఆలయకమిటీ సభ్యులు తెలిపారు. ఈనెల 7న స్వామివారికి అభిషేకాలు, హవనం, ఎదుర్కోలు, జూలై 8న ఉదయం 10.30 నిమిషాలకు రుక్మిణీవిఠలేశ్వర కళ్యాణ మహోత్సవం, అన్నదానం, సాయంత్రం, పల్లకిసేవ ఊరేగింపు, 9న అభిషేకాలు, భజనలు, సామూహిక కుంకుమార్చనలు, పల్లకీసేవ, రథోత్సవం, 10న సామూహిక కుంకుమార్చనలు, గోపాలకాలువలు, పల్లకీసేవ, తదితర కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. భక్తులందరూ అధికసంఖ్యలో తరలివచ్చి ఉత్సవాలను విజయవంతంచేయాలని కోరారు.

## మంచినీటి బిల్లు సమస్యను పరిష్కరించండి

**-అమీన్‌పూర్ బిజెపిమండల అధ్యక్షుడు ఈర్ల రాజు**



వాటర్ బోర్డ్ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న ఈర్ల రాజు

**అమీన్‌పూర్, జూలై 5, ప్రభాతవార్త:** మంచినీటి బిల్లు సమస్యను పరిష్కరించాలని కోరుతూ హైదరాబాద్ మెట్రో వాటర్ బోర్డ్ ఎండి అశోక్‌కుమార్‌రెడ్డిని తన కార్యాలయంలో అమీన్‌పూర్ బిజెపి మండల అధ్యక్షుడు ఈర్ల రాజు, దుర్గాకాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు శనివారం మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేయడం జరిగింది. అమీన్‌పూర్ మున్సిపాలిటీపరిధిలోని కిష్టారెడ్డి పేటలోని దుర్గానగర్‌కాలనీకి చెందిన దుర్గానగర్ వెల్ఫేర్‌మెంబర్స్ అసోసియేషన్ సభ్యులు, బిజెపి అమీన్‌పూర్ మండల అధ్యక్షుడు ఈర్ల రాజు ముదిరాజ్ ఆధ్వర్యంలో హైదరాబాద్ వాటర్ బోర్డు ఎండి అశోక్ కుమార్ రెడ్డి నీ,అధికారులు ఉత్తం సింగ్,మహేష్ కుమార్ కలిసి సమస్య పరిష్కారానికి వినతిపత్రం అందజేశారు. గ్రామ పంచాయతీలుగా ఉన్న కిష్టారెడ్డిపేట కాలనీలు ఇటీవల అమీన్‌పూర్ మున్సిపాలిటీలో విలీనమైన నేపథ్యంలో అపార్ట్మెంట్స్‌కు ఆక్యుపెన్సీ సర్టిఫికెట్‌లేని కారణంగా నీటి బిల్లులపై మూడింతల రెట్టింపుచార్జీలు వసూలుచేస్తున్నారని తెలిపారు. గృహనమోదు ప్రాపర్టీట్యాక్స్ ఆధారంగా రెగ్యులర్‌ఛార్జీలు వర్తింపజేయాలని వారిని విజ్ఞప్తి చేశారు. ఈవినతిపై స్పందించిన ఎండి అశోక్‌కుమార్ రెడ్డి ఈ సమస్యను సీఎంఓ స్థాయికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ రాజేందర్ గౌడ్, నాయికోటి మహేందర్,జనరల్ సెక్రటరీలు రాజ్ కుమార్ గౌడ్,గోరికాడి శ్రీకాంత్ యాదవ్,దుర్గానగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు రాకేష్ సముద్రాల,బూత్ ప్రెసిడెంట్ నాగేంద్ర,బిజెపి మండల కౌన్సిల్ మెంబర్స్ రాకేష్, సుధాకర్ రెడ్డి,వివిధ అపార్ట్మెంట్స్ మెంబర్స్ గణేష్, శ్రీనివాస్, తపస్, ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఊరూరా ఎమ్మార్పీఎస్ జెండాలను ఎగురవేయాలి

**-ఎంఎస్‌పి జిల్లా ఇంచార్జ్ మంద కుమార్**



మాట్లాడుతున్న ఎంఎస్పి జిల్లా ఇంచార్జ్ మంద కుమార్

**గజ్వేల్ టౌన్, జూలై 5, ప్రభాతవార్త:** ఎస్సీ వర్గీకరణ సాధనకోసం మందకృష్ణమాదిగ నేతృత్వంలో ఎమ్మార్పీఎస్ చేసిన 30 ఏళ్ల పోరాటం విజయం సాధించిందని, ఈనెల 7వ తేదీన ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఊరూరా ఎమ్మార్పీఎస్ జెండాలను ఎగురవేసి సంబరాలు నిర్వహించుకోవాలని ఎంఎస్‌పి జాతీయ నాయకుడు, జిల్లా ఇంచార్జ్ మంద కుమార్ అన్నారు. శనివారం గజ్వేల్‌లో ఆయన మాట్లాడుతూ ఎస్సీవర్గీకరణ ద్వారా మాదిగలకు సంక్రమించిన 9శాతం రిజర్వేషన్లను ఉపయోగించుకొని విద్య, ఉద్యోగ రంగాల్లో రాణించాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం కొన్ని చోట్ల ఎస్సీవర్గీకరణ ప్రకారం కులధృవీకరణ పత్రాలు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తుందన్నారు. ఎస్సీ వర్గీకరణను ప్రతి శాఖ అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కో-ఇంచార్జ్ మల్లిగారి యాదగిరి, ఎమ్మార్పీఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇంచార్జ్ ఉబ్బని ఆంజనేయులు, సీనియర్ నాయకులు శనిగారి రాజు, బురికి ప్రశాంత్, ప్రజ్ఞాపూర్ రాజు, పల్లెపహాడ్ శ్రీకాంత్, శ్రీను, బాలేష్ పాల్గొన్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

**-వసతి గృహాన్ని పరిశీలించిన ప్రత్యేక అధికారి**



కెజిబివి పాఠశాలలో వంటగదిని పరిశీలిస్తున్న ప్రత్యేక అధికారి

**అల్లాదుర్గం, జూలై 5, ప్రభాతవార్త:** విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలని మండల ప్రత్యేక అధికారి కరుణాకర్ సూచించారు. శనివారం మండలకేంద్రమైన అల్లాదుర్గంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంను కరుణాకర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల పరిసరాలను, మరుగుదొడ్లను, వంటగదిని ప్రత్యేకంగా పరిశీలించారు. వంటగదిలో కూరగాయలను, సామాగ్రి భద్రపరిచే గదిని తనిఖీ చేశారు. పాఠశాలపరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని బాధ్యులకు సూచించారు. మెనూప్రకారం విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలని ఆదేశించారు. విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అందుకుంటూ ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపిడిఓ చంద్రశేఖర్, ఎంపిఓ లింగప్ప, కార్యదర్శి ప్రభాకర్‌లు ఉన్నారు.

# సంక్షేమ పథకాలను ఇంటింటికీ తీసుకెళ్లడమే లక్ష్యం

**-కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డి**



సిసిరోడ్ల నిర్మాణానికి శంకుస్థాపనచేస్తున్న కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డి, తదితరులు

**నర్సాపూర్, జూలై 5, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని కాంగ్రెస్‌ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలను ఇంటింటికీ తీసుకు వెళ్లడమే తమలక్ష్యమని అదేవిధంగా గ్రామాలు అభివృద్ధిచెందడానికి ముఖ్యంగా సిసిరోడ్ల నిర్మాణం ఎంతో అవసరమని కాంగ్రెస్‌పార్టీ నర్సాపూర్ నియోజకవర్గ ఇన్చార్జ్ ఆవుల రాజిరెడ్డి అన్నారు. శనివారం నర్సాపూర్ మండలపరిధిలోని నత్నాయపల్లి గ్రామంలో సిసిరోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేసి అలాగే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సైతం భూమిపూజలు చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో సిసి రోడ్ల నిర్మాణంతో గ్రామప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం అందించడమే ప్రభుత్వలక్ష్యం అన్నారు. ఈ మేరకు పలు గ్రామాల్లో సిసి రోడ్ల నిర్మాణానికి కాంగ్రెస్‌ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుందన్నారు. అంతేగాక నత్నాయపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లలబ్ధిదారులు నిర్మిస్తున్న ఇళ్ల నిర్మాణాలకు సైతం భూమిపూజ చేసి ఆయన చేతులమీదుగా పనులు ప్రారంభించారు. ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల ప్రతిలబ్ధిదారుడికి సురక్షితనివాసం అందించడంలో కీలకపాత్ర పోషిస్తానని అన్నారు. ఇళ్లు లేని నిరుపేదలైన అర్హులైన లబ్ధిదారులందరికీ దశలవారీగా ఇందిరమ్మ ఇళ్లను అందిస్తామని కాంగ్రెస్ పార్టీ నర్సాపూర్ నియోజకవర్గ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డితోపాటు కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఉదయ్‌కుమార్, గ్రామ కాంగ్రెస్‌నాయకులు కార్యకర్తలు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇల్లు

**-కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా నాయకులు : కనకరాజు**



చిన్నకోడూరులో ఇందిరమ్మ ఇల్లు నిర్మాణానికి ముగ్గుపోస్తున్న దృశ్యం

**సిద్దిపేట రూరల్ (చిన్నకోడూరు), జూలై 5, ప్రభాతవార్త:** ఇల్లులేని ప్రతి నిరుపేదకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తుందని ఇల్లు మంజూరు కానివారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కాంగ్రెస్‌పార్టీ ఎస్సీసెల్ జిల్లానాయకులు, ఇందిరమ్మ కమిటీసభ్యులు మిట్టపల్లి కనకరాజు(బైండ్ల) అన్నారు. చిన్నకోడూరు మండల కేంద్రంలో శనివారం ఇందిరమ్మ ఇల్లు మంజూరైన లబ్దిదారునితో కలిసి ఇంటి నిర్మాణానికి ముగ్గుపోసి మాట్లాడారు. ఇందిరమ్మ ఇల్లు మంజూరైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇంటి నిర్మాణాలు త్వరగా పూర్తి చేసుకోవాలన్నారు. గత బిఆర్ఎస్ సర్కారు హయాంలో డబుల్‌బెడ్ రూంల నిర్మాణాల పేరిట గూడులేని నిరుపేదలకు తీరని అన్యాయం చేసిందన్నారు. పేదల సంక్షేమమే కాంగ్రెస్ సర్కారు ధ్యేయమని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, లబ్దిదారులు తదితరులు పాల్గొన్నారు.

## సిసి కెమేరాలతో నేరాల నియంత్రించవచ్చు: ఎస్ఐ

**బెజ్జంకి, జూలై 5, ప్రభాతవార్త:** ప్రస్తుత ఆధునికకాలంలో సులభతరంగా డబ్బునుసంపాదించాలనే దురుద్దేశంతో దొంగతనాలకు, మోసాలకు పాల్పడుతున్న వారు అధికమౌతున్నారని నేరాల నియంత్రణలో సిసి కెమేరాలు ప్రముఖపాత్ర పోషిస్తాయని మండల వ్యాప్తంగా పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సులు నిర్వహించిన క్రమంలో మండలంలోని వీరాపూర్ గ్రామస్థులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి స్వంత ఖర్చులతో గ్రామంలో 8 సిసి కెమేరాలు ఏర్పాటు చేయగా ఆ కెమేరాలను ఎస్ఐ తిరుపతి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూనగ్రామంలో గుర్తుతెలియని వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. దుకాణదారులు, వ్యాపారస్థులు కూడా కెమేరాలు ఏర్పాటుచేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ శంకర్‌రావు, సిబ్బంది శ్రీనివాస్, సంతోష్, రవిందర్ పంచాయతీ కార్యదర్శి కర్రావుల బాబుతోపాటు తదితరులు ఉన్నారు.

## ఉల్లి సాగుపై రైతులకు అవగాహన



ఉల్లిసాగుపై అవగాహన కల్పిస్తున్న ఉద్యానవనశాఖ అధికారులు

**మనూర్, జూలై 5, ప్రభాతవార్త:** మండల పరిధిలోని రానాపూర్, తుమ్నూర్ గ్రామాల్లో శనివారం ఉద్యానవనశాఖ అధికారులు రైతులకు అవగాహన కల్పించారు. సమీకృత అభివృద్ధి మిషన్ పథకం ద్వారా ఉల్లిసాగు ప్రోత్సాహకాలు (ఆర్థిక సహాయం) అందుకునేందుకు ఉల్లిసాగు రైతులు రాష్ట్ర ప్రభుత్వానికి రైతులు ధరఖాస్తులు చేసుకోవాలని ఉద్యానవనశాఖ అధికారి కె.మౌనికరెడ్డి రైతులకు సూచించారు. ఉల్లిసాగు కోసం ఎకరానికి 8వేలు సబ్సిడీ అందించనుందన్నారు. పండ్ల తోటల నిర్వహణకు, కూరగాయల సాగుకు అందచేస్తున్న రాయితీ వివరాలను రైతులకు వివరించారు. ఆయిల్ పామ్ పంటలు వేసుకుని దళారి వ్యవస్థ లేకుండా ప్రభుత్వం నిర్ణయించిన ధరకే గోద్రేజ్ ఆగ్రోవే సంస్థ పంటను కొనుగోలు చేస్తుందన్నారు. ఎకరానికి 50,918 రూపాయల రాయితీ రూపంలో ఆయిల్‌పామ్ పంటకు అందిస్తోదని గుర్తు చేశారు. పంట మార్పిడిలో భాగంగా ఉద్యానపంటలను సాగు చేసుకోవాలని ఏడిఏ నూతన్ కుమార్ రైతులకు సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి మహేష్ చౌహాన్, ఏఈఓ సంధ్య, మాజీ సర్పంచ్ బ్రహ్మానందరెడ్డి, రైతులు విష్ణువర్ధన్‌రెడ్డి, గొల్ల బాషన్న, మున్నూరు లక్ష్మన్న, సుభాష్‌రావు, పండరీనాథ్‌రావు, రాజు తదితరులు పాల్గొన్నారు.

## దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేద్దాం

**-ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్**



సమావేశంలో మాట్లాడుతున్న దృశ్యం

**సిద్దిపేట రూరల్, జూలై 5, ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి రాగానే కార్మికులు, రైతులపై దాడులు మొదలు పెట్టిందని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి కిష్టాపురం లక్ష్మణ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎడ్ల గురువారెడ్డి భవనంలో శనివారం నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్మికులు ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకువచ్చి పెట్టుబడిదారులకు కొమ్ముకాస్తూ కార్మిక వర్గానికి తీరని అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు సంస్థలకు అప్పగిస్తున్నారని తెలిపారు. కార్మికులకు, రైతులకు కేంద్ర ప్రభుత్వం చేస్తున్న అన్యాయాలపై పోరాటం చేయాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ఈనెల 9న దేశవ్యాప్తంగా నిర్వహించ తలపెట్టిన సార్వత్రికసమ్మెను జిల్లాలో విజయవంతంచేద్దామని పిలుపునిచ్చారు. సమావేశంలో ఎఐటియుసి నాయకులు పిట్ల మల్లేశం, తవసుపల్లి బిక్షపతి, భవననిర్మాణరంగ అధ్యక్షులు బెక్కంటి సంపత్, కార్యదర్శి శివలింగ కృష్ణ, నాయకులు ఐలయ్య, అంజనేయులు, రాజు, శీను పాల్గొన్నారు.

## బొల్లారంలో కొవ్వొత్తుల ర్యాలీ



కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

**జిన్నారం, జూలై 5, ప్రభాతవార్త:** పాశమైలారంలో గత సోమవారం సంబంధించిన దుర్ఘటనలో మృతిచెందిన వారి ఆత్మకు శాంతి కలగాలని కోరుకుంటూ జిన్నారం మండలం బొల్లారం మున్సిపల్ బిజెపి పట్టణ అధ్యక్షుడు కెజెఆర్ ఆనంద్ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. శుక్రవారం బొల్లారంలోని హనుమాన్ మందిరం నుండి గాంధీబొమ్మ చౌరస్తా వరకు కొవ్వొత్తులు వెలిగించి శాంతి ర్యాలీ నిర్వహించారు. అనంతరం రెండునిమిషాలపాటు మౌనం పాటించారు. మృతులకు శ్రద్ధాంజలి ఘటించారు. మృతుల ఆత్మకు శాంతికలగాలని, వారి కుటుంబాలకు మనోధైర్యం నింపాలని కోరుకుంటూ ప్రార్థించారు.

## వికలాంగుల పెండింగ్ పెన్షన్‌లు విడుదల చేయాలి

**-తహసీల్దార్‌కు వినతి పత్రం అందచేసిన కిష్టయ్య**



తహసీల్దార్‌కు వినతిపత్రం అందచేస్తున్న
వికలాంగులసంఘం ఉపాధ్యక్షులు కిష్టయ్య

**అల్లాదుర్గం, జులై 5, ప్రభాతవార్త:** వికలాంగుల కార్పొరేషన్‌ను బలోపేతం చేస్తూ పెండింగ్‌లో ఉన్న పెన్షన్‌లను వెంటన విడుదలచేసి వికలాంగులను ఆదుకోవాలని వికలాంగులసంఘం ఉపాధ్యక్షులు కిష్టయ్య డిమాండ్‌చేశారు. శనివారం మండలకేంద్రమైన అల్లాదుర్గంలో తహసీల్దార్ మల్లయ్యకు కిష్టయ్య వినతిపత్రం అందచేశారు. ఈసందర్భంగా కిష్టయ్యమాట్లాడుతూ వికలాంగులు అనేకసమస్యలతో సతమతమవుతున్నారని, వారికి బకాయిపడిన పెన్షన్‌లను వెంటనే అందజేయాలని సూచించారు. పెన్షన్‌ల కొరకు దరఖాస్తులు చేసుకున్న వారికి పెన్షన్‌లు మంజూరుచేయాలని డిమాండ్‌చేశారు.

# సాయినగర్‌లో బస్తీ దర్శన్‌లో కార్పొరేటర్



సాయినగర్‌లో బస్తీ దర్శన్‌లో పాల్గొన్న కార్పొరేటర్ పుష్పనగేష్

**రామచంద్రాపురం, జూలై 5, ప్రభాతవార్త:** రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని సాయినగర్ కాలనీలో శనివారం బస్తీ దర్శన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కార్పొరేటర్, జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ సభ్యురాలు బూరుగడ్డ పుష్పనగేష్ ఆయా శాఖల అధికారులతో కలిసి కాలనీలో కలియతిరుగుతూ ప్రజలనుంచి సమస్యలను అడిగితెలుసుకున్నారు. ఈసందర్భంగా కార్పొరేటర్ పుష్పనగేష్ మాట్లాడుతూ కాలనీలో విద్యుత్ స్తంభాలు, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్, నాలా చుట్టూ రిటైనింగ్‌వాల్ తదితర సమస్యలు ఉన్నట్లు కాలనీ వాసులు బస్తీ దర్శన్ దృష్టికి తెచ్చారన్నారు. రోడ్డు నంబర్ 5లో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, సిసి రోడ్డు నిర్మించాలని కాలనీవాసులు వినతిచేశారని, త్వరలోనే నిధులు మంజూరు చేయించి సమస్యలను పరిష్కరిస్తానని హామీచేశానన్నారు. భారత్ పెట్రోల్ పంప్ వద్ద గుంతలమయంగా మారిన ప్రాంతం నుంచి మెయిన్ రోడ్డు నుంచి కాలనీ రోడ్డు వరకు రాంప్‌కావాలని కాలనీవాసులు కోరారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ పవన్, మల్లికార్జున్, రాంకీ ఇంచార్జి విజయభాస్కర్‌రెడ్డి, జిహెచ్ఎంసి శానిటేషన్, ఇంజనీరింగ్ ఈఈ సురేష్, డిఈ నరేందర్ ఎలక్ట్రిసిటీ ఏఈ రాజేష్, జలమండలి, స్ట్రీట్ లైట్స్ రాంకీ విభాగ అధికారులు, సిబ్బంది, సిఎం మల్లేష్, రవికిరణ్‌గౌడ్, అప్పల భాస్కర్, పండరి, ప్రీతిగౌడ్, శ్రీకాంత్‌రెడ్డి, రాజు, కుమ్మరి మాణయ్య, నారాయణ, శోభ, అనిల్, కిషోర్, విజయ్, పవన్, నర్సిరెడ్డి పాల్గొన్నారు.

## జాతీయస్థాయిలో రాణించాలి

**-ఫుట్‌బాల్ క్రీడాకారిణి సత్కరించిన హరీష్‌రావు**



ఫుట్‌బాల్ క్లబ్ క్రీడాకారిణి చైతన్యను సన్మానిస్తున్న హరీష్‌రావు

**సిద్దిపేట అర్బన్, జూలై 5, ప్రభాతవార్త:** జాతీయ స్థాయి అండర్-17 ఫుట్‌బాల్ టీం ప్రాబబుల్స్‌కు ఎంపికైన సిద్దిపేట ఫుట్‌బాల్ క్లబ్ క్రీడాకారిణి చైతన్యను మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు శనివారం శాలువాతో ఘనంగాసత్కరించి అభినందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ మహిళా ఫుట్‌బాల్‌టీంలో ఎంపికై సిద్దిపేట పేరునిలబెట్టాలన్నారు. కార్యక్రమంలో సిద్దిపేట ఫుట్‌బాల్‌కోచ్ అక్బర్ నవాబ్, ఫుట్‌బాల్ అసోసియేషన్ సంయుక్తకార్యదర్శి సాజిద్, చైతన్య తండ్రి రాము పాల్గొన్నారు.

## ఘనంగా కొనసాగుతున్న పీర్ల పండగ



దోసపల్లిలో పీర్లను దర్శించుకుంటున్న భక్తులు

**మనూర్, జూలై 5, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన మనూర్‌తో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో పీర్లపండగను ప్రజలు ఆనందోత్సవాలతో ఘనంగా జరుపుకుంటున్నారు. ఆయాగ్రామాల్లోని మసీదుల వద్ద పీర్లను ప్రతిష్ఠించుకుని ఉత్సవాలను జరుపుకుంటున్నారు. కులమతాలకు అతీతంగా పీర్లపండగ జోరుగా కొనసాగుతున్నాయి. పీర్లనుదర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటున్నారు. అలైబలై పాడుతూ ఆటలు ఉత్సాహంగా పీర్ల పండగను పసందుగా జరుపుకుంటున్నారు. పట్టణప్రాంతాలకు వలసవెళ్లినవారు స్వగ్రామాలకు చేరుకోవడంతో గ్రామాలు సందడిగా మారాయి.

## ఆస్తికోసం సోదరుడి హత్య

**-జోగిపేట సిఐ అనిల్‌కుమార్**



విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న సిఐ అనిల్‌కుమార్

**జోగిపేట, జూలై 5, ప్రభాతవార్త:** ఆస్తి తగాదాల నేపథ్యంలో స్వంత అన్ననే సోదరుడు మట్టుపెట్టిన సంఘటనకు సంబంధించిన వివరాలను జోగిపేట సిఐ అనిల్‌కుమార్ శనివారంనాడు విలేకరుల సమావేశంలో వెల్లడించారు. వట్‌పల్లి మండలం పల్వట్ల గ్రామానికి చెందిన మంగళి సాయిలు(53) గత నెల 18న ఇంట్లో నుంచి వెళ్లి తిరిగి రాకపోవటంతో జూన్ 25న వట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో భార్య ఫిర్యాదు చేసింది. ఈఫిర్యాదు ఆధారంగా పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ మేరకు అనుమానితులపై నిఘాపెట్టారు. కనిపించకుండాపోయిన మంగళి సాయిలు సోదరుడు మల్లేశంను అదుపులోకి తీసుకొని విచారించారు. గత నెల 18న సాయిలు జోగిపేటకు బయలుదేరగా అతడిని మల్లేశం, అతని బావ సురేష్‌లు ద్విచక్రవాహంపై వెంబడించారు. అందోలుమండలం తాలెల్మ శివారులోని గట్టుప్రాంతంలో సాయిలును అడ్డుకొని సాయిలుతో వాగ్వాదానికి దిగారు. నీవల్లే ఆస్తి తగాదాలు జరుగుతున్నాయంటూ సాయిలుపై ఆగ్రహం వెళ్లగక్కారు. ఈ క్రమంలోనే సాయిలు తలపై రాతితో కొట్టగా అతను కోమాలోకి వెళ్లాడు. దీంతో అతడిని గట్టు ప్రాంతంలో కొద్దిదూరం మోసుకెళ్లారు. అయితే సాయిలును వెంబడించే క్రమంలోనే మల్లేశం మేనల్లుడు మహేష్‌కు ఫోన్‌చేసి ఇంట్లో ఇనుప రాడ్‌ను తీసుకొని, లింగమయ్యను తోలుకొని రావాలంటూ ఫోన్‌చేసి లొకేషన్ చెప్పారు. దీంతో వారుకూడా సంఘటన జరిగిన ప్రాంతానికి వచ్చారు. వారంతా కలసి సాయిలుపై రాళ్లువేసి అతను మృతిచెందాక అతడి మృత దేహాన్ని తాలెల్మ గ్రామానికి చెందిన దంపుయార్డు పక్కన ఉన్న పిల్ల కాలువ పక్కన బొందతీసి పెట్టారు. ఈ మేరకు తహశీల్దారు సమక్షంలో బొందతీసి శవానికి పోస్టుమార్టం నిర్వహించినట్లు జోగిపేట సిఐ అనిల్‌కుమార్ తెలిపారు. కాగా హత్యకు పాల్పడిన మల్లేశం, సురేష్, లింగమయ్య,మహేష్‌లను అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

## మహిళ హత్య కేసును చేధించిన పోలీసులు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న గజ్వేల్ ఎసిపి నర్సింలు

**గజ్వేల్, జులై 5, ప్రభాతవార్త:** మహిళ మెడలోని బంగారు నగల కోసం హత్యకు పాల్పడిన హంతకున్ని గజ్వేల్ పోలీసులు పట్టుకొని రిమాండ్‌కు తరలించారు. గజ్వేల్ ఏసిపి కె.నర్సింలు తెలిపిన వివరాల ప్రకారం గతనెల 24వ తేదీ మంగళవారం మధ్యాహ్నం గజ్వేల్ మండలం ధర్మారెడ్డిపల్లి గ్రామానికి చెందిన నల్ల సత్తవ్వ అనే మహిళ గ్రామ శివారులోని తన వ్యవసాయ భూమి వద్దకు ఒంటరిగా వెళ్తుండగా ఇది గమనించిన మెదక్ జిల్లా వెల్దుర్తి మండలం కోమటిపల్లి గ్రామానికి చెందిన కిచ్చిగారి శివశంకర్ ఆమెను వెంబడించి ఆమె మెడలో ఉన్న బంగారు గొలుసు, కమ్మలను ఇవ్వాలని దాడికి పాల్పడగా సత్తవ్వ వద్ద ఉన్న కొడవలితో ఎదురు తిరగడంతో కొడవలిని శివశంకర్ లాక్కొని ఆమె మెడతో పాటు పలు చోట్ల దాడిచేసి హత్యకు పాల్పడ్డాడు. అనంతరం ఆమె మెడలో ఉన్న బంగారు గొలుసు, చెవి కమ్మలు, కొడవలిని ఎత్తుకెళ్ళాడు. ఇదిలా వుండగా గజ్వేల్ పోలీసులు తమదైన శైలిలో గజ్వేల్ నుండి చేగుంట వరకు ఉన్న 150 సిసి కెమెరాలు పరిశీలించి హంతకున్ని పట్టుకున్నారు. హంతకుడు శివశంకర్‌పై గతంలో మూడు బైక్ చోరీ కేసులు, అతనిపై అతని భార్య పెట్టిన వేధింపుల కేసు ఉన్నాయని ఏసిపి తెలిపారు. హంతకున్ని సుమారు 15 రోజుల్లో పట్టుకున్నందుకు గజ్వేల్ సిఐ సైదాను, అడిషనల్ సిఐ ముత్యంరాజును, ఏఎస్ఐ యాదగిరి, కానిస్టేబుళ్లు రవి, వెంకటేష్, నరేందర్‌గౌడ్, సురేందర్, వెంకన్న, స్వామి, దివ్య, ఐటి కోర్ సిబ్బంది శ్రీకాంత్‌లను ఏసిపి నర్సింలు అభినందించారు. అలాగే హంతకున్ని పట్టుకొని అరెస్ట్ చేసినందుకు గానూ సిద్దిపేట సిపి అనురాధ అభినందించి రివార్డు ప్రకటించినట్లు తెలిపారు.